కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



63

మూలం: http://kottapalli.in/2013/08/welcome

మొత్తం ప్రతుల సంఖ్య: 2000

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'జెండా వందనం': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

వెల:రూ.25/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

స్వతంత్రం

1919 వ సంవత్సరం.. బైశాఖీ పండుగ రోజు.. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో పిల్లలు, పెద్దలు- ఆడవాళ్ళు, మగవాళ్ళు- ఊళ్ళోవాళ్ళు, బంధువులు- చాలామంది షికారుగా దగ్గర్లో ఉన్న ఓ తోటకు వెళ్ళారు. వాళ్లలో చాలా మందికి తెలీదు- బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నవాళ్ళు కొందరు ఆరోజునే, అక్కడ ఓ బహిరంగసభ పెట్టుకున్నారని.

తోటలో ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. హటాత్తుగా బ్రిటిష్ సైనికాధికారి- 'జనరల్ డయ్యర్' అనేవాడు- పెద్ద పటాలంతో వచ్చి ఆ తోటని చుట్టుముట్టేశాడు. ఎలాంటి హెచ్చరికా లేదు- నేరుగా తుపాకీలతో కాల్పులు మొదలు పెట్టించేశాడు! మనుషుల్ని పిట్టల్ని కాల్చినట్లు కాల్చి పారేశారు ఆరోజున. పారిపోయేందుకు ఎవ్వరికీ వీలవ్వలేదు- చుట్టూ ఎత్తైన గోడలు! చూస్తూ చూస్తూండగానే పది నిముషాల్లో వెయ్యిమంది చనిపోయారు. 1500 మందికి పైగా గాయపడ్డారు.

డయ్యర్ అట్లా ఎందుకు చేశాడు? ఒకటి, అతనికి భారతీయులంటే కోపం. "బానిసలు నోరు మూసుకొని పడి ఉండాలిగానీ, గొడవలెందుకు చెయ్యాలి?"అని. రెండోది, మనం అనాగరికులం అని అతని నమ్మకం-"వీళ్ళంతా జంతు సమానులు: వీళ్లని ఎంతమందిని, ఏం చేసినా పాపం లేదు" అని. మూడోది, అతని పై అధికారి 'మైఖెల్ ఓడ్వయిర్' అనేవాడు అతనికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చేసి ఉన్నాడు-"నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి- ఈ భారతీయులకు బుద్ధి చెప్పు" అని. ఇక నాలుగోది, అతను నిజంగానే నిర్దయుడు: తర్వాత 'ఇట్లా ఎందుకు చేశావయ్యా?' అని అడిగితే "గోలీలు ఐపోయినైగాని, లేకపోతే అక్కడికి చేరిన ఇరవైవేలమందినీ ఖతం చేసి ఉందును" అన్నాడట అతను!

ఈ కాల్పుల సంగతి తెలియగానే భారతదేశం మొత్తం భగ్గుమన్నది. బందులు, ధర్నాలు, రాజకీయాలు... బ్రిటిష్ పార్లమెంటు వరకూ చర్చలు జరిగాయి. బ్రిటన్ ప్రధాని మటుకు ఏమీ మాట్లాడలేదు. డయ్యర్‌ని, మైఖెల్ ఓడ్వ్యయర్ ని ఇద్దరినీ లండన్ పిలిపించుకున్నారు. వాళ్ళకి హీరోలకి తగినట్లు సన్మానాలు చేశారు. ఓడ్వ్యయర్‌కైతే మరింత పెద్ద పదవి ఇచ్చారు!

"మన దేశం బానిసత్వంలో ఉండేది" అంటే అర్థం అదీ: బ్రిటిష్ వాళ్ళు ఏదనుకుంటే అది చేశారు, మనతో.

ఇదంతా జరిగి చాలా ఏళ్లయింది కదా, ఇప్పుడు మనకెవరికీ ఆ సంగతులు అంత బాగా గుర్తు లేవు. అందుకనే, మనం ఇప్పుడు అంత సులభంగా "రండి! పెట్టుబడులు పెట్టండి!" అని విదేశీయుల్ని చవకగా ఆహ్వానించగల్గుతున్నాం. వేరే దేశాల భాషల్నే నేర్చుకుంటున్నాం, వాళ్లనే అనుకరిస్తున్నాం, వాళ్ల అలవాట్లనే చేసుకుంటున్నాం.

అయితే ఆ రోజుల్లో అట్లా లేరు అందరూ- జలియాంవాలా బాగ్ సంఘటన జరిగినప్పుడు 'ఉధంసింగ్' అనే కుర్రవాడికి ఇరవయ్యేళ్ళు- అక్కడ చేరిన జనాలకి మంచినీళ్ళు అందిస్తున్నాడు అతను. అంతలో కాల్పులు జరిగాయి. అతని చుట్టూ ఉన్నవాళ్లంతా చనిపోయారు. వాళ్ళ చాటున నక్కి, ఇతను తన ప్రాణాలు కాపాడుకున్నాడు. జలియాంవాలా బాగ్ గురించి ఎవ్వరూ ఏమీ చేయట్లేదని అతను ఉడికి పోయాడు. జరిగినదాన్ని అందరూ తీసుకున్నంత తేలికగా తీసుకోలేకపోయాడు అతను. తననీ తన తోటివాళ్లనీ ఇట్లా చేసిన డయ్యర్‌నీ, ఓడ్వ్యయర్‌నీ వదలకూడదని నిశ్చయించుకున్నాడు- అట్లా ఒకటి కాదు- రెండు కాదు- ఇరవై ఒక్క సంవత్సరాలపాటు రగిలాడు. చివరికి 1940 లో మారు వేషం వేసుకొని, లండన్ వెళ్ళి, అక్కడ మైఖెల్ ఓడ్వ్యయర్‌ని నిండు సభలో తుపాకీతో కాల్చి చంపాడు. ఇరవయ్యేళ్ళ కుర్రాడు ఇరవయ్యొక్క ఏళ్లపాటు నిరంతరం అసహ్యించుకోగలిగిన పరిస్థితులు, అవి!

ఉధం సింగ్ అట్లా ఎందుకు చేశాడు? ఉరికంబం ఎక్కుతూ తనే స్వయంగా చెప్పాడు-"ఓడ్వ్యయర్

నేరం చేశాడు. నా దేశ ప్రజల ఆత్మను అణచివేసేందుకు ప్రయత్నించాడు. 21 సంవత్సరాలపాటు నేను తపించింది అందుకే- ఇన్నాళ్లకైనా నా ఆశయాన్ని నెరవేర్చుకున్నందుకు నాకు సంతోషంగా ఉంది. నాకు చావంటే భయం లేదు. దేశంకోసం మరణిస్తున్నందుకు నేను గర్విస్తున్నాను. బ్రిటిష్ పాలనలో నా దేశ ప్రజలు ఎందరో దరిద్రంలో మగ్గారు. వారందరి తరఫునా ఇది నా నిరసన. ఇట్లా చెయ్యటం నా ధర్మం" అని!

మన దేశానికి స్వాతంత్ర్యం ఊరికే రాలేదు- ఎందరో ఉధం సింగులు, సుభాస్ చంద్రబోసులు, భగత్ సింగులు ఎక్కడికక్కడ ఆయుధాలతో దుమారాలు లేపితే వచ్చింది; గాంధీలు, తిలక్‌లు, ఆజాద్‌లు, గఫార్‌ఖాన్‌లు జనాల్ని కూడగట్టి అల్లరి చేస్తే వచ్చింది. భారతీయులందరూ ఒక్క గొంతుతో "మీరు ఒద్దు- పోండి!" అని గట్టిగా అరిస్తే తప్ప రాలేదు, స్వాతంత్ర్యం!


అట్లా వచ్చిన స్వాతంత్ర్యం మనకు తెలీకుండానే మన వేళ్ల సందుల్లోంచి జారిపోతే ఎలా? అంతమంది త్యాగధనుల కృషిఫలం కదా, ఇది?! దీన్ని మనం చేతులారా మళ్ళీ ఎవరికో అప్పచెప్పేస్తామేమో, జాగ్రత్తగా ఉండాలి. అందుకనే మన దేశం గురించి మనం బాగా తెలుసుకోవాలి. మన సంస్కృతిని అర్థం చేసుకోవాలి. చరిత్రని గుర్తు చేసుకుంటూ ఉండాలి. స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవాలి.

స్వతంత్రంగా ఆలోచిద్దాం! బాధ్యతతో నడచుకుందాం!!

స్వాతంత్ర్యదినోత్సవ అభినందనలతో,

కొత్తపల్లి బృందం.

స్వాతంత్ర్యం మన జన్మహక్కు!



నీతి చంద్రిక

విగ్రహం-20


జరిగిన కథ: కాకిని నమ్మొద్దంటాడు చక్రవాక మంత్రి. కానీ హంస రాజు హిరణ్యగర్భుడు 'అవసరాన్ని బట్టి శత్రువులతో కూడా స్నేహభావం వహించాలి' అంటూ ఎలుక-పిల్లి-గుడ్లగూబల కథ చెప్పి, కాకిని తన జట్టులో చేర్చుకున్నది. ఇక చదవండి, నీతిచంద్రిక-44 వభాగం...

మూలం: కందుకూరి వీరేశలింగం *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

ఆపైన హిరణ్యగర్భుడు మంత్రితో "శత్రువు చిత్రవర్ణుడు తన సైన్యంతో సహా మలయ పర్వతం పైకి చేరుకొని అక్కడ విడిది చేసి ఉన్నాడు. ఇట్లాంటి సమయంలో మనలో మనం వాదులాడుకుంటూ ఉంటే శత్రువుకే లాభం. కాబట్టి, నీ అతి వాదనలు అన్నిటినీ ప్రక్కనబెట్టి, చేయవలసిన పనిని గురించి ఆలోచించు. ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుందో జాగ్రత్తగా ఆలోచించి చెప్పు" అన్నది.

చక్రవాక మంత్రి కొంచెం చిన్నబోయి, వెంటనే తేరుకొని, కొంచెం సేపు కళ్ళు మూసుకొని

ఆలోచించి, రాజుతో "ప్రభూ! చిత్రవర్ణుడి చేత అవమానింపబడిన అతని మంత్రి చిన్న-బుచ్చుకొని ఉన్నాడని తెలిసింది కదా? 'ఇది ఒక్కటే మనకు పనికొచ్చే సంగతి' అని నాకు అనిపిస్తున్నది. అంతేగాక, 'ఇతరులకు వశం అయినవాడు, తొందరపాటు మనిషి, యోధులను అవమానించేవాడు- శత్రువులకు సులభంగా లొంగుతారు' అని పెద్దలు చెబుతారు. ఈ మూడు లక్షణాలూ ఇప్పుడు చిత్రవర్ణుడిలో నిండుగా కనిపిస్తున్నాయి.



ఇప్పుడైతే అతని సేనాపతులు ప్రయాణపు బడలిక వల్ల కొంచెం అజాగ్రత్తగా ఉంటారు; దూర ప్రయాణం వల్ల అలసి, కొంతకాలంగా ఆకలి దప్పికలకు కూడా లోనయి, అతని సైన్యం చప్పగా ఉంటుంది. ఇక ఆ నెమలి రాజు కూడా, మన 'కోటను ఎలా వశపరచుకోవాలి' అన్న ఆలోచనలో తలమునకలై, వెనక-ముందు చూసుకోకుండా ఉంటాడు- కాబట్టి విరోధులను పరాభవించటానికి ఇది మంచి సమయం: 'ఈ కొండనీ, అడవినీ దాటి-విరోధి సైన్యంపైన ఆకస్మికంగా దాడి చేసి, దొరికిన వారిని దొరికినట్లు చంప'మని మన కొంగ సైన్యాన్ని ఆదేశించండి- ఇక ఆలస్యం ఎందుకు?" అన్నది.

హంసరాజు ఆ మాటలకు చాలా సంతోషించింది. 'ఇక పని మొదలయింది' అన్న ఉత్సాహంతో మనసు చిందులు వేస్తుండగా అది తన సైన్యాధ్యక్షులను పిలిచి ఏం చేయాలో చెప్పింది- "ఎవరైనా శత్రువును ఎదుర్కొని, ప్రాణాలొడ్డి శౌర్యంతో పోరాడితే వచ్చేది గౌరవంగాని, కేవలం ఆకారం వల్ల వచ్చే గౌరవం అసలొక గౌరవమే కాదు. అందువల్ల మీరు యుద్ధంలో వెన్నుచూపకండి- ప్రాణం మీదికి వచ్చినా సరే, పోరాడండి. ఇక ఆలస్యం వద్దు- అందరి మనసూ ఒక్కటై నడవండి! మనదే జయం!" అన్నది. రాజు నోటినుండి ఆ

మాటలు వచ్చిందే తడవు, సైన్యాధ్యక్షులు మహోత్సాహంగా కదలారు. తమ తమ సేనా సమూహాలతో సహా తక్షణం బయలుదేరి, కొండల్ని అడవుల్ని అన్నిటినీ అధిగమిస్తూ పోయారు.



ఇక అక్కడ, నెమలి రాజు చిత్రవర్ణుడి సైన్యం ప్రయాణపు బడలికతోటీ, ఆకలి దప్పులతోటీ నిజంగానే నిస్తేజమై ఉన్నది. నీరసంకొద్దీ వాటి ఒళ్ళు తూలుతున్నది. అలాంటి సమూహం మీదికి ఒక్కసారిగా ప్రళయం వచ్చినట్లు వచ్చి పడ్డాయి, హిరణ్యగర్భుడి సైన్యాలు. తమకు కనిపించిన శత్రువునల్లా రెక్కలతో పటపటా కొట్టినై; వాడియైన గోర్లతోటీ, ముక్కులతోటీ పొడిచి పీడించినై; యుద్ధరంగం అంతటా నెత్తురు మడుగులు కట్టించినై; లెక్కలేనంత మందిని తుదముట్టించినై, అవి!

ఆ విధంగా శత్రుపక్షుల ధాటికి తట్టుకోలేక నేలకూలి- యంత్రపు విడిభాగాలు విరిగి చెల్లా చెదురుగా పడి ఉన్నట్లు- చాపలు పరచినట్లు- నేలనంతటా పరచుకొని ఉన్న తన సైన్య సమూహాలను చూసి, నెమలిరాజు చిత్రవర్ణుడి మనసు దు:ఖంతో చెదరిపోయింది. ఆ బాధలో అది కొంతసేపు ప్రాణం లేని బొమ్మ మాదిరి నిశ్చేష్టం అయిపోయింది. సేవకులు సపర్యలు చేస్తే కొద్ది సేపటికి తేరుకొన్నదది. అయినా వెంటనే దారుణమైన ఆ యుద్ధంలో ఏం జరిగిందో గుర్తుకు రాగా, మరింత దు:ఖం ముంచుకొచ్చింది దానికి.

అంత జరిగాక అది అలిగి కూర్చున్న మంత్రి దూరదర్శిని చూసి "శత్రువుల వల్ల మన సైన్యానికి ఇట్లా ఎక్కడలేని ప్రమాదమూ సంభవిస్తూంటే, ఎవరో కానివాళ్ళు చూసినట్లు చూస్తూ ఊరకుండటం నీవంటి గొప్పవారికి తగునా? నువ్వు పట్టించుకోకపోవటం అనేదే పిడుగు పాటయ్యి వీళ్ళ మరణానికి కారణం

అయ్యింది. ఇంత చక్కని మన సైన్యంలో శరీరానికి గాయం కాని వాడంటూ మందుకోసం వెతికినా కానరావట్లేదు.



నా అదృష్టం ఇట్లా ఉన్నప్పుడు నిన్ను ఇన్నిన్ని మాటలు అనటం తప్పు. అయినా మనం ఎంత బలవంతులం అయినా సరే, మన మనస్సులో ఒకసారి ఒక చీడపురుగు చొరబడినాక, అది అక్కడే నిలచి మనల్ని ఆటలాడిస్తుంది తప్పిస్తే, మనం దానినుండి ఎంత తప్పించుకుందామనుకున్నా పోదు. జ్ఞానవంతుడివైన నీ సలహాను పెడచెవిన పెట్టి, కరకుగా మాట్లాడినందుకు నాకు తగిన శాస్తే జరిగింది. ఇదంతా నా పాప ఫలమే.

ఇక ఇప్పుడైనా నీ మనసులో కొంత కరుణకు చోటు ఇవ్వు. నేను ఇంతవరకూ కఠినంగా అన్న మాటలన్నీ మరచిపోయి, మళ్ళీ నన్ను చల్లగా చూడు. లేదంటావా, ఈ సైన్యాన్ని తీసుకొని వింధ్యపర్వతాలకు తిరుగు దారి పట్టు. నాదేమున్నది- దేవుడు ఎట్లా తలిస్తే అట్లా అవుతుంది నా గతి: ఇదిగో ఇక్కడ నా శరీరం ఉంది; అక్కడ వింధ్యారణ్యం ఉన్నది. అంతేకాని, నేనే రాజుగా ఉండి ఇంతమంది ఇట్లా నిష్కారణంగా నశిస్తుంటే చూస్తూ భరించలేకపోతున్నాను. కారణం అంటూ ఏదీ లేకనే ఆకాశం తూట్లు పడేట్లు సందడి చేస్తుండేది కదా మన సైన్యం? అది ఇప్పుడు నీరసించి చిటుక్కుమనక పడి ఉన్నది. పెద్ద ఊరంత ఉండే మన బలగం అంతా ఇప్పుడు చిన్న స్మశానం అంతది అయిపోయింది. ఇక చూస్తూ చూస్తూ వీళ్లను కూడా ఎలా మృత్యువు పాలు చేసేది? పుణ్యమో, పాపమో- ఇక అంతా నీ చేతుల్లో పెడుతున్నాను. తెలిసినా, తెలియకున్నా అంతా నువ్వే సర్దుకొని రావాలి. అంతులేని ఈ ఆపదలో

నన్ను ముంచినా, తేల్చినా నీదే భారం" అని ప్రాధేయపడి, కరుణ పుట్టేట్లు ఏడ్చింది.

తమ రాజు ఆవిధంగా ఏడ్చేసరికి దూరదర్శి మనస్సు కరిగింది. ఇదివరకటి తన కోపం అంతా చల్లారగా, ప్రసన్నమైన చిత్తంతో అది అన్నది- "ప్రభూ! తమరి యుద్ధ పరాక్రమమూ, శౌర్యమూ అసామాన్యమైనవి. యుద్ధంలో తమరికి ఎదురొడ్డి నిలువగలవారెవరూ లేరు. అందువల్ల తమరి పరాక్రమం ఆధారంగా ఏ విధంగానైనా సరే, ఈ కోటను ఆక్రమించి, విజయులమై, అన్ని సంపదలనూ బహుమతులుగా స్వీకరించి, త్వరలోనే-తమరు చెప్పినట్లు వింధ్యారణ్యానికే-వెళ్దాం.

సుఖదు:ఖాలు రెండూ ఎంతెంతవారికీ అనుభవించక తప్పనివి కదా?! గతంలో చేసుకున్న కర్మల పర్యవసానంగా సంభవించే ఈ సుఖదు:ఖాలనుండి ఎవరుమాత్రం తప్పించుకోగలరు?

ఆయువు తీరి చనిపోయినవాళ్లకోసం దు:ఖించటం మాని, ఇప్పుడు చేయవలసిన పనిని చెయ్యండి. 'ఇప్పుడు మిగిలిన ఈ కొద్దిమంది సైనికులతో అంతులేని బల సంపన్నుడైన పగవాడిని ఎట్లా ఎదిరించను?' అని చింతించకండి. లోకంలో ఉపాయం ఉన్నవాడికి అసాధ్యం అంటూ ఏదీ లేదు. తమరు నిజంగా తలచుకుంటే ఈ శత్రుమూకలను గెలవటం ఏమంత పెద్ద పని?!



నా సామర్థ్యం ఎంతటిదో నేనే చెప్పుకుంటే బాగుండదు- 'ఆత్మ ప్రశంస అనర్థం' అని పెద్దలు చెబుతారు. నన్ను నేను లెక్కించుకోవటమెందుకు- నా బారిన పడ్డవాళ్ళు ఏమౌతారో ముందు ముందు మీకే తెలుస్తుంది. ఇక మిగిలిన మన వారి బలం

కూడా ఏమంత తక్కువ కాదు. అంతెందుకు, తమరి బలం ఎంతటిదో తమకే తెలీదు- తమరికి కొంచెం రోషం వచ్చిందంటే చాలు- హంసలు-గింసలు తమరి ముందు ఎక్కడ నిలుస్తాయి?

అందుకని, ముందుగా మనం అందరం కలిసి కోటనుండి బయటికి వచ్చే మార్గాలను మూసేద్దాం. ఎట్లాంటివాళ్లనూ బయటికి రానివ్వద్దు- అలా కోట లోపలి వాళ్లంతా ఆకలి దప్పులతో అలమటించేట్లు చేద్దాం. ముందుగా మనవాళ్లను కోట ముఖద్వారం వద్ద మోహరిద్దాం. అటువైపునుండి రాకపోకలను నిరోధిద్దాం.

'ముందుచూపే విజయ సిద్ధికి కారణం' అని చెబుతారు- మన సేనాపతిని పిలువనంపండి; ముందుచూపుతో తంత్రం నడుపుదాం. యుద్ధరంగంలో మన ప్రతాపాన్ని చూపుదాం . ఇక గెలుపు మనదే!" అని రాజుగారి మనసుకు నచ్చేట్లు మాట్లాడింది. దాంతో రాజుగారి మనసు పొంగింది. ఉత్సాహం వెల్లివిరిసింది.

అంతలోనే ఈ సంగతి హిరణ్య గర్భుని కొలువునుకూడా చేరింది. కొంగ-ధవళాంగుడు వేగంగా తిరిగి వచ్చి, హంసరాజు హిరణ్య గర్భుడిని సందర్శించి, "ప్రభూ, ఆ నెమలి రాజు చాలా వేగంగా కోట దాపులకు చేరుకుంటున్నాడు. అదిగో, చూడండి- అతని రెక్కల మెరుపులు ఆకాశాన్నంటుతున్నాయి. తన సైన్యంలో అధిక భాగం నశించాక చివరికి ఆ రాజు తన మంత్రి గొప్పతనాన్ని గుర్తించాడు. ఇప్పుడు ఆయన్ని బ్రతిమాలి-బామాలి తిరిగి ప్రసన్నుడిని చేసుకొన్నాడు. ఆ మంత్రి సలహాలే ఊతంగా, తన సొంత బలమే ఆధారంగా విజృంభించనెంచాడు. మన కోటను ముట్టడించేందుకు బయలుదేరాడు. తమరు ఇక తక్షణం చేయవలసిన పనులమీద మనసుపెట్టాలి" అన్నది.

(మిగతా కథ మళ్ళీ....)



తిండిపోతు చెప్పిన కథ

కరకరా కారప్పూసలు నములుతూ, తియ్యతియ్యగా బాదాం పాలను చప్పరిస్తూ, మంచి ఊతప్పం లాంటి ఈ కథని చదివారనుకోండి, భలే రుచిగా ఉంటుంది- ప్రయత్నించండి మరి...
కథనం: పి.హర్షవర్ధన రెడ్డి, ఐదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

అనగా అనగా ఓలిగ అనే రాజ్యం ఒకటి ఉండేది. ఆ రాజ్యాన్ని బాదుషా అనే నవాబు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన రాణి జిలేబి. వాళ్లకొక అందాల కుమార్తె: పేరు గులాబ్‌జాం.

గులాబ్‌జాం పూతరేకులంత సున్నితంగాను, కోవా అంత కోమలంగాను, పెరుగుపచ్చడి అంత తెల్లగాను ఉండేది. ఆమె మందిరానికి గులాబీల గోడలుండేవి. అయితే అక్కడికి దారి కనుక్కోవటమే కష్టం. అది కారప్పూస లాగా గందరగోళంగా ఉండేది. ఆ దారికి దధ్యోదనం కాపలా ఉంటాడు. మందిరానికి తాటికాయ తాళంకూడా వేసి ఉండేది.

ఓలిగ రాజ్యమంతా మైసూర్‌పాక్ మంత్రిగారి సలహాల కారణంగా, సుభిక్షంగా ఉంది.

అయితే ఒక రోజున వడ, ఆవడ అనే ఇద్దరు దొంగలు జంతికలు అనే పడవనెక్కి, నూనె అనే నదిని దాటి, కాజాలతో తెడ్డు వేసుకుంటూ వచ్చారు- వచ్చి, కారప్పూస భవనం ముందు పడి మొద్దు నిద్రపోతున్న దధ్యోదనాన్ని చూసి నవ్వుకున్నారు. మురుకుల బీగాలతో తాటికాయ తాళాన్ని తీసేందుకు ప్రయత్నించి, అది తెరుచుకోకపోయే సరికి, గులాబీల గోడకు కజ్జికాయంత కన్నం వేసి చివరికి ఎలాగో ఒకలాగా గులాబ్‌జాం ని ఎత్తుకుపోయారు.

దీన్నంతా చూస్తున్న చిత్రాన్నం మటుకు చిత్రంగా గమ్మున ఊరుకుండిపోయింది!

ఇట్లా అయ్యేసరికి రాజ్యమంతా చింతపులుసంత చింతాక్రాంతమైంది. గులాబ్‌జాంను విడిపించుకొచ్చినవాళ్లకు ఓలిగ రాజ్యంతో పాటు గులాబ్‌జాం కూడా దక్కుతుందని నవాబుగారు అప్పడం మీద డప్పు కొట్టించి చాటించారు.

కుడుము అనే యువకుడొకడు ఈ వార్తను విన్నాడు. వినగానే అతను టమేటాబాత్ లాగా ఎర్రబారాడు. దోసెల వల వేసి, నూనె మీదుగా పారిపోతున్న వడనీ, ఆవడనీ పట్టి బంధించాడు.



గులాబ్‌జాంతో కలిసి జాంగిరీలా దర్బారుకు వచ్చి, నవాబుకు వాంగీబాత్ లాగా వంగి నమస్కరించాడు. బాదుషా నవాబు వడనీ ఆవడనీ తినెయ్యమని ఆజ్ఞాపించి, గులాబ్‌జామును కుడుముకు జత చేశాడు. ఇంకేముంది, రాజ్యమంతా రసగుల్లాలతో పండగ చేసుకున్నది!



వీర నరేశ్ కథ

ఎన్నడో ఇచ్చిన రాజేష్-కుందేలు బొమ్మకు చాలా స్పందనలు వచ్చాయి. అన్నిటినీ ప్రచురించేందుకు వీలుకాదు గదా, అందుకని, ఇక ఈ ఒక్క కథతోటీ వాటినన్నిటినీ ముగిద్దామనుకున్నాం. ఈ అరి వీర భయంకర-ఘోర-పరాక్రమోపేత-సాహస-స్వాతంత్ర్య సమర గాధని చదవండి, మరి ఈ మాసపు బొమ్మకు కథలు రాసి పంపండి.

రచన: బి.సాయిక్రిష్ణ, తొమ్మిది-రోజ్, అరవింద స్కూలు, కుంచనపల్లి.

అనగనగా ఒక ఊళ్ళో నరేశ్ అనే పిల్లవాడొకడు ఉండేవాడు. ఒకరోజున నరేశ్ ఇంటి బయట ఆడుకుంటూ ఉన్నాడు- అంతలో ఎక్కడినుండి వచ్చిందో మరి, ఒక కుందేలు కుంటుకుంటూ వచ్చి, వాడి దగ్గర స్పృహతప్పి పడిపోయింది.

నరేశ్‌కి ఆ కుందేలుని చూడగానే చాలా బాధ వేసింది. చాలా జాగ్రత్తగా ఆ కుందేలుని తీసుకొని ఇంట్లోకి పరుగెత్తి, దానికి చికిత్స చేశాడు. మరునాటికల్లా అది కొంచెం కోలుకున్నది. అప్పుడు వాడు దానికి లేత గడ్డిని ఆహారంగా తెచ్చి ఇచ్చి, ఒక పాత్రలో మంచినీళ్ళు పోసి తాగించాడు. గడ్డి తిని, కడుపు నిండా నీరు త్రాగి పడుకున్న కుందేలు

చాలా సేపటి వరకూ పడుకొని నిద్రపోయింది. నరేశ్ దానికేసే చూస్తూ కూర్చున్నాడు. సాయంత్రం నిద్రలేచి, ఆ కుందేలు అడవివైపుకే చూస్తూ కన్నీరు కార్చటం మొదలు పెట్టింది.

నరేశ్ దానిని ప్రేమగా నిమిరి, 'ఎందుకు, ఏడుస్తున్నావు? మీ ఇల్లు గుర్తుకొచ్చిందా?' అని అడిగాడు.

"ఏమని చెప్పను, ఎంతని చెప్పను? నా కుటుంబం, నా పరివారం, నా ప్రజలు, నా సైన్యం- - అంతా మట్టిగొట్టుకుపోయింది!" అని జవాబిచ్చిందది, ఇంకా ఏడుస్తూ.

"అదేమి?" అని ఆశ్చర్యంగా అడిగిన నరేశ్‌కి అది తన కథ చెప్పింది-

"నేను కుందేకొండ అనే రాజ్యానికి రాజును. నా ఆస్థానంలో నేను ఏది చెబితే అదే న్యాయం, అదే ధర్మం, అదే శాసనం- ఎవ్వరూ నన్ను అతిక్రమించేవాళ్ళే లేరు. ప్రజల్ని నేను కన్నబిడ్డలుగా భావించాను- ప్రజలు నన్ను కన్నతండ్రిలాగా ప్రేమించారు. నాపేరు భైరవసింహ. నా సైనికులు, సైన్యాధికారులు అందరూ మహా వీరులు, గొప్ప యుద్ధనైపుణ్యం కలవారు. పిల్లులలాంటి జంతువులనికూడా మా సైన్యం అదరగొట్టి, బెదరగొట్టి, చెదరగొట్టేది. మూడు సంవత్సరాలలో మేం 80 పిల్లులని హతమార్చామంటే, మా బలం ఎంతటిదో ఊహించు!



మరి మేం వాటిని ఊరికే హతమార్చలేదు- పిల్లులన్నీ మా మీదికి దండెత్తి వచ్చి, మా ప్రజల్ని అష్టకష్టలు పెడితే తప్ప, మేం వాటిమీదికి పోనే లేదు. చివరికి ఆ పిల్లులన్నీ మా శరణు జొచ్చాయి- ఇకమీద మంచిగా నడచుకొంటామని ప్రమాణం చేశాయి.

'ఎవరినీ కష్టపెట్టం' అని మాట ఇచ్చినమీదట, మేం వాటిని మా రాజ్యంలోనే ఉండనిచ్చాం.

అయితే విశ్వాసఘాతకులు- అవి ఏం చేశాయో తెలుసా? దొంగచాటుగా మా మీదికి భారీ నక్కల సైన్యాన్ని ఉసిగొల్పాయి. నా భార్య-పిల్లలు, నా సైన్యం అన్నీ ఆ నక్కలకు బలయ్యాయి. నేను ఇదిగో, గాయాలతో ఇలా వచ్చి పడ్డాను. నా ప్రజల్ని ఇప్పుడు ఆ నక్కలు ఏం చేస్తున్నాయో తలచుకుంటేనే బాధగా ఉంది" అన్నది.

కుందేలు కథ వినేసరికి నరేశ్‌కి ఎక్కడలేని కోపం వచ్చింది. అమాయకపు కుందేళ్లని ఇలా హింసించిన నక్కలమీద వాడు మండిపడ్డాడు. 'ప్రతీకారం చెయ్యాల్సిందే' అని రగిలి-పోయాడు. తన ఊరి జనాలను, కుక్కల సైన్యాన్ని, ఆయుధాలను తీసుకొని, కుందేలు దారి చూపగా అడవిలోకి పోయాడు.

అక్కడ ఇప్పుడు నక్కల రాజ్యం నడుస్తున్నది. కుందేళ్లన్నీ వాటికి లోబడి ప్రవర్తిస్తూ అష్టకష్టాలూ అనుభవిస్తున్నాయి. తమరాజు బ్రతికే ఉన్నాడని తెలిసే సరికి వాటికి చాలా ధైర్యం వచ్చింది. అందరూ కలిసి నక్కల మీద తిరగబడ్డారు.



మనుషులు, కుక్కలు, కుందేళ్ళు ఆయుధాలతో సహా అలా వచ్చి పడేసరికి నక్కల సైన్యం కకావికలైంది. యుద్ధంలో చాలా నక్కలు చనిపోయాయి. మిగిలినవి ఎక్కడివక్కడ పారిపోయాయి. కుందేళ్లన్నీ వీర నరేష్‌కీ, ఊరి జనాలకీ, కుక్కలకీ ధన్యవాదాలు చెప్పుకున్నాయి.

దేశమును ప్రేమించుమన్నా! మంచియన్నది పెంచుమన్నా!!



సంగీతం

రచన: సి.వి.యం.జాహ్నవి, ఎనిమిదవ తరగతి, శ్రీవిశ్వశాంతి సీనియర్ సెకండరీ హైస్కూలు, వుయ్యూరు.

అనగా అనగా ఉయ్యూరులో రమేష్ అనే ఒక అబ్బాయి ఉండేవాడు. అతనికి సంగీతం అంటే చాలా ఇష్టం. అయితే వాళ్ళ అమ్మానాన్నలకి మటుకు సంగీతం అంటే అస్సలు ఇష్టం లేదు. వాళ్ళకి వాడు ఇంజనీరు అవ్వాలని ఉండేది. 'ఇంజనీరు అవ్వాలంటే ఇట్లాంటివి పెట్టుకోకూడదు' అని వాళ్ళ నమ్మకం. ఒకసారి రమేష్ వాళ్ల నాన్నతో అన్నాడు- "నాన్నా, నేను... సింగర్ అవ్వాలను-కుంటున్నాను.." అని. వాళ్ల నాన్నకు వెంటనే కోపం వచ్చేసింది- "ఏమీ అక్కర్లేదు. నువ్వు ఇంజనీర్ అయితీరాలి" అని గట్టిగా అరిచాడు. పాపం రమేష్ వేరే గదిలోకి వెళ్ళి కూర్చొని బాగా ఏడ్చాడు.

అయితే అతను బాగా చదవటంలేదని, వాళ్ల అమ్మానాన్నలు అతన్ని వేరే ఊరిలో ఉన్న పెద్ద

బడిలో చేర్పించారు. రమేష్ ఇప్పుడు హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. హాస్టల్‌లో భోజనం రుచిగా లేక కొంచెం, పాఠాలు అర్థం కాక కొంచెం, ఇంకా సంగీతం ఉండక కొంచెం- అతను సరిగా చదవటం మానేశాడు. వెనకబడటం మొదలు పెట్టాడు. తమ ఊళ్ళో ఎప్పుడూ తరగతి ఫస్టు వచ్చే రమేష్‌కి ఇప్పుడు బడిలో 'సి' గ్రేడు కూడా రాసాగింది.



అయితే కొద్ది రోజులకు వాళ్ల బడిలో ఓ పాటల పోటీ పెట్టారు. రమేష్ అందులో పాల్గొని ఎంతో చక్కగా పాడాడు. వాళ్ల టీచర్లందరూ అతన్ని మెచ్చుకొని, 'నువ్వు ఇంకా బాగా సాధన చెయ్యాలి' అని ఉత్సాహ పరచారు. అంతే, ఇక ఆ రోజునుండీ రమేష్ మళ్ళీ బాగా చదవటం కూడామొదలు పెట్టాడు. మళ్ళీ తరగతిలో తనే మొదటివాడుగా రాసాగాడు.

అంతేకాదు- ఆ తర్వాత ఎక్కడ పాటల పోటీలు జరిగినా వాళ్ల బడి తరపున రమేష్ ఆ పోటీల్లో పాల్గొనేవాడు. అట్లా సంపాదించిన బహుమతులను అన్నింటినీ ఎవ్వరికీ చూపించకుండా తన గదిలోనే దాచుకునేవాడు.

ఇట్లా చాలా సంవత్సరాలు గడిచాయి. రమేష్ వరసగా అన్ని తరగతులనూ మంచి మార్కులతో దాటుకుంటూ వచ్చాడు. చివరికి వాళ్ల నాన్న అన్నట్లు ఇంజనీరు కూడా అయ్యాడు. ఇంకా చదువుతూనే మంచి ఉద్యోగం కూడా సంపాదించుకున్నాడు.

ఆ సంవత్సరం జరిగిన రాష్ట్ర స్థాయి పాటల పోటీలో పాల్గొని మొదటి బహుమతి సంపాదించుకున్నాడు రమేష్. ఆ కార్యక్రమం టివిలో వస్తుండగా చూసారు, వాళ్ళ

అమ్మానాన్నలు! అంతమంది పెద్దలు తమ కొడుకును మెచ్చుకుంటూ ఉండటం చూసి వాళ్ళు చాలా సంతోషపడ్డారు.



రమేశ్‌ని పిలిచి, "ఏమిరా, ఇంతింత పెద్ద పోటీల్లో పాల్గొంటూ కూడా మాకు ఒక్క ముక్క కూడా చెప్పలేదేమి?" అని బాధపడ్డారు.

అప్పుడు రమేష్ తను దాచి పెట్టుకున్న బహుమతులన్నిటినీ తెచ్చి చూపించాడు వాళ్లకు-"నేను చిన్నప్పటి నుండీ సంగీతాన్ని ఆరాధిస్తూనే ఉన్నాను నాన్నా, మీరు కోప్పడతారని, ఆ సంగతి ఇంట్లో చెప్పలేదు" అన్నాడు.

రమేష్ వాళ్ల నాన్న కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నన్ను క్షమించు రమేష్! నిన్ను చిన్నప్పటినుండీ సంగీతానికి దూరంచేశాను. ఆ ప్రపంచంలో పడితే చదువుల్ని నిర్లక్ష్యం చేస్తావని భయపడ్డాను. నన్ను క్షమించు" అన్నాడు రమేష్‌చేతులు పట్టుకొని.

"పరవాలేదులెండి నాన్నా, ఇష్టంగా ఏదైనా పనిని చేసినప్పుడు దాని ప్రభావం ఇతర రంగాలమీద తప్పక పడుతుంది. ఎటొచ్చీ మీరు ఆ ప్రభావం మంచిగా ఉండదని పొరపడ్డారు. నేనూ నా సాధనను గురించి మీకు చెప్పనే లేదుకదా, అందుకని నాదీ తప్పే. నన్ను మీరూ క్షమించాలి" అన్నాడు రమేష్ ప్రేమగా.

కృషిలేని ఫలితమూ, అభ్యాసం లేని విద్యా ఉండవు



సమయ స్ఫూర్తి

ఒట్టి (కథ కాని) కథ ఇది! నిజంగా ఒలింపిక్స్ చరిత్రలో నోమాజ్ కొడుకు ఫ్లెమింగ్ అనేవాడు ఉన్నాడనటానికి దాఖలాలు ఏవీ కనబడలేదు, ఎంత వెతికినా..

కథనం: చదువుల క్రాంతి, పదవ తరగతి, ZPHS *టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.*

గ్రీస్ దేశంలో కొత్తగా ఆటల పోటీలు మొదలైన రోజులవి. తర్వాత తర్వాత ఆ ఆటల పోటీలే 'ఒలింపిక్స్' అనే పేరుతో ప్రసిద్ధిగాంచాయి. ఆ రోజుల్లో ఆ పోటీల్లో ఒక ఐదు దేశాలు మటుకు పాల్గొనేవి.

ఆ రోజున సైక్లింగ్ పోటీ ప్రారంభం కానున్నది. సైక్లింగ్‌లో ప్రావీణ్యత ఉన్న ఆటగాళ్ళు విదేశాలనుండి వచ్చి పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒక ప్రక్కన నిర్వాహకులు ఆటల పోటీని మొదలు పెట్టేందుకు సన్నద్ధం అవుతుంటే, మరొక ప్రక్కన వాటిని చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి చేరారు; ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

సైక్లింగ్ పోటీ ప్రారంభం అయింది. మొదటి

విడతలో ఎంపిక చేసిన ఆటగాళ్ళు పదిహేను మంది పాల్గొన్నారు. ప్రేక్షకులంతా ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ ఆటగాళ్ళకి ఉత్సాహం కలిగించారు. సైక్లింగ్ పోటీలో మధ్యవరసలో ఉన్నాడు, ఫ్లెమింగ్.

ఫ్లెమింగ్ తండ్రి నోమాజ్ గతంలో ఇదే పందెంలో పాల్గొని ఓడిపోయాడు. ఇప్పుడు కొడుకు కూడా అదే అంశంలో పోటీ పడుతుండటంతో అందరిలోనూ ఆసక్తి నెలకొని ఉన్నది.

సైకిల్ రేస్ ప్రారంభం అయ్యింది. క్రీడాకారులు సైకిళ్ళు తొక్కుకుంటూ రివ్వున ముందుకు దూసుకుపోయారు. ఫ్లెమింగ్ మనసులో తండ్రి నోమాజ్ మెదిలాడు..ఆయన ఆశల్ని ఫలింపజేయవలసింది తనే- ఆ ఆలోచన రాగానే ఫ్లెమింగ్ సైకిల్ వేగం పెంచాడు. ఇప్పుడు అతను అందరికంటే ముందున్నాడు. తోటి నక్షత్రాలను అధిగమించి ముందుకు సాగే తోకచుక్క మాదిరి, అతను క్షణాల్లో మిగిలిన వాళ్లకు అందనంత దూరం చేరుకున్నాడు.

మానవ ప్రయత్నానికి ప్రకృతి అన్నివేళలా సహకరించాలని లేదు. మెరుపువేగంతో సాగుతున్న ఫ్లెమింగ్ సైకిలుకు ప్రకృతే అడ్డువచ్చింది- గొర్రెల మంద రూపంలో.

ఆ రోజుల్లో ఇప్పటి మాదిరి సైక్లింగ్ ట్రాకులు ఏవీ ప్రత్యేకంగా ఉండేవి కావు. గ్రామీణ ప్రాంతాల దారుల్నే ఈ పోటీలకోసం కూడా వాడుకునేవాళ్ళు. ఇప్పుడు అకస్మాత్తుగా ఫ్లెమింగ్ వేగానికి గొర్రెల మంద ఒకటి అడ్డుకట్ట వేసింది!



ఆటల నిర్వాహకులు గందరగోళ పడ్డారు. అక్కడ నిలబడి చూస్తూన్న అభిమానులు

ఆందోళన పడ్డారు. ఎవరికీ ఏం చేయాలో తోచలేదు.

ఫ్లెమింగ్ మటుకు సైకిల్ తొక్కుతూనే ఆలోచించాడు. గొర్రెల్ని గుద్దుకుంటూ, నెట్టుకుంటూ పోయి వాటిని గాయపరచటం అతనికి ఇష్టం లేదు. అలాగని తన వేగం తగ్గించటానికీ వీలులేదు. ఎట్లాగ, మరి?

అతను కూడా పల్లె మనిషే. గతంలో అతనికి కూడా గొర్రెల్ని పెంచిన అనుభవం ఉన్నది! మరుక్షణం అతను గబగబా ఈల వేయటం మొదలు పెట్టాడు. గొర్రెలను అదిలించే వింత వింత శబ్దాలు అనేకం అతని నోట్లోంచి వెలువడ్డాయి. గొర్రెలన్నీ తలెత్తి అతనివైపు చూసి, వేటికవి ప్రక్కకు పరుగుపెట్టాయి. సైకిల్ వేగం పిసరంత తగ్గిందేమో, అంతకు మించి నష్టం ఏమీ జరగలేదు!

గొర్రెల మందని దాటుకొని మళ్ళీ వేగాన్ని పెంచిన ఫ్లెమింగ్ ఆ సంవత్సరపు సైక్లింగ్ క్రీడలో మొదటివాడుగా నిలిచాడు. నోమాజ్ కొడుకు సమయస్ఫూర్తే అతన్ని విజేతగా నిలిపిందని చెప్పచ్చు! లేదంటే గొర్రెలమందని చెదరగొట్టటం ఏమంత చిన్న పని?!



అటుతర్వాత నిర్వాహకులు పందేల సమయంలో గొర్రెలమందలు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవటం మొదలు పెట్టారు!

నవ్వు!

వెంగళప్ప: వందలో ఎన్నిసున్నాలుంటాయి?

రవి: రెండు.

వెంగళప్ప: కాదు- ఒకటే! వ ప్రక్కన ఉండేది ఒకటే సున్న!



కోతి మనసు తెచ్చిన తంటా

అవ్వ-కోతి కథ ఈనాటిది కాదు. అనంతపురం పరిసరాల్లో రకరకాల రూపాల్లో వినబడే జానపదకథకి మరో రూపం ఇది..

సేకరణ: కె.వెంకటసాయి, ఆరవ తరగతి, జవహర్ నవోదయ విద్యాలయ, లేపాక్షి.

ఒక ఊళ్ళో పేద అవ్వ ఒకామె ఉండేది. ఆ అవ్వకు ఒక మనవరాలు ఉండేది. ఒక రోజున అవ్వ కూలికి వెళ్ళి వస్తూంటే దారిలో బక్కచిక్కిన కోతిపిల్ల ఒకటి కనబడింది. దాన్ని చూసి జాలి పడి, అవ్వ దాన్ని ఇంటికి తీసుకొచ్చి, ప్రేమగా పెంచి పెద్ద చేసింది.

పెద్దదవుతున్న కొద్దీ కోతికి బాధ్యత కూడా తెలిసి వచ్చింది. 'తన కోసం అంత కష్టపడుతున్నదే అవ్వ!' అని అదికూడా అవ్వవెంట కూలికి పోవటం, లేకపోతే అడవికి వెళ్ళి కట్టె పుల్లలు ఏరుకు రావటం- ఇట్లా ఏదో ఒక పని చేస్తూ ఉండేది.

ఒకసారి అట్లా కట్టెపుల్లలకోసం అడవిలోకి వెళ్ళిన కోతికి దట్టమైన తీగల వెనక దాగి ఉన్న

గుహ ఒకటి కనబడింది. ఆ గుహలో అది లెక్కపెట్టలేనంత బంగారం, వెండి కనబడ్డాయి. అంత సంపదను ఒక్కచోట చూసి కోతి నిర్ఘాంత పోయి నిల్చున్నది-

అంతలోనే అక్కడికి ఒక దొంగ వచ్చాడు. వాడు ఆ బంగారాన్ని, వెండిని వేరు వేరు గోతాలలో వేసి మూటలు కట్టాడు. అప్పుడు అర్థమైంది కోతికి- ఆ సంపదంతా దొంగదే- వాడు దాన్ని నిలవచేసుకునే గోదాము అన్నమాట, ఆ గుహ!

దొంగ వెళ్ళిపోయేంతవరకూ అక్కడే తచ్చాడిన కోతి, దొంగ అటు వెళ్ళిపోగానే బంగారంతో నిండిన బస్తానొకదాన్ని భుజాన వేసుకొని అవ్వ దగ్గరికి చేరుకున్నది. "అవ్వా అవ్వా! ఈ బంగారాన్ని జాగ్రత్తగా దాచు! ఇది నా చెల్లికోసం నేను కూడబెడుతున్న సంపద" అన్నది అవ్వతో. అవ్వకు ఏమీ అనుమానం రాలేదు. 'నిజంగానే అది అంత సొమ్మును కూడ బెట్టిందేమో' అనుకున్నది అవ్వ.

ఆ తర్వాత కూడా కోతి చాలా సార్లు గుహలోకి దూరి తనకు దొరికిన సంచీలనల్లా తెచ్చి అవ్వకు ఇచ్చింది. ప్రతిసారీ "ఇది నా చెల్లికోసం నేను కూడబెడుతున్న సంపద" అనే చెబుతూ వచ్చింది అవ్వకు.

చివరికి అవ్వకు అనుమానం వచ్చింది: 'ఇది ఎవరినో మోసం చేస్తున్నట్లున్నదే' అని, కోతి వెనకనే అడవికి బయలుదేరింది అవ్వ, ఒకరోజున. తీరా వెళ్ళి చూస్తే అది దొంగ గుహ! అవ్వకు భయం వేసింది- దాంతో బాటు కోపం కూడా వచ్చింది. కోతి బంగారు మూటని పట్టుకొని ఇంటికి వెళ్ళిపోగానే ఆమె ధైర్యంగా వెళ్ళి దొంగముందు నిల్చున్నది. దొంగ ఆమెను చూసి తికమక పడిపోయాడు. అవ్వ వాడికి జరిగిందంతా చెప్పి, "నాయనా, నీ సొత్తు నాకు అవసరం లేదు. నాకున్నది ఒకే ఒక్క మనవరాలు- దాని పెళ్ళి చేసానంటే నా బాధ్యత తీరిపోతుంది. ఆ మాత్రం కష్టం నేనూ చేయగలను. అందుకని మా యింటికి వచ్చి నీ సొమ్మును నువ్వు తీసుకెళ్ళిపో" అన్నది.

ఆ రోజు ఇంకా సాయంత్రం అవ్వకనే అవ్వ ఇంటికి వచ్చాడు దొంగ. అక్కడ అవ్వ మనవరాల్ని చూసేసరికి వాడి మనసూ

మారింది. "నేను ఇంక దొంగతనాలు మానేస్తాను. నువ్వు అనుమతించావంటే నీ మనవరాల్ని పెళ్ళి చేసుకొని నీతిగా బ్రతుకుతాను" అన్నాడు అవ్వతో. కొంచెం ఆలోచించిన అవ్వ, మనవరాలి ముఖం చూసి, 'సరే అలాగే కానివ్వు' అన్నది.

అంతలోనే అక్కడికి వచ్చిన కోతికి మాత్రం దొంగని చూసేందుకు ముఖం చెల్లలేదు. అవ్వ తన మనవరాల్ని దొంగకు ఇచ్చి పెళ్ళి చేస్తాననటం కూడా దానికి నచ్చలేదు. అందుకని అది దొంగ వెనకనే వెళ్ళింది- వాడు తన గుహలో దూరి పడుకోగానే గుహకి నిప్పు పెడదామనుకున్నదది! అయితే ఆరోజున దొంగకు అసలు నిద్రే పట్టలేదు. బయటకోతి ఎండు పుల్లలు, గడ్డీ జమ చేస్తుండగా వాడు లేచి నిశ్చింతగా అడవిలో తిరిగి వచ్చేందుకు పోయాడు.

పుల్లలన్నీ జమ అవ్వగానే కోతి నిప్పు తెచ్చి వాటిని అంటించి సంతోషంతోగంతులు వేసింది. ఆ సంతోషంలో అది తను ఆ పుల్లల మధ్యలోనే గెంతుతున్న సంగతి చూసుకోనేలేదు. మంటలు అన్నివైపులనుండీ చుట్టుముట్టాక, అది భయంతో అరవటం మొదలు పెట్టింది. అంతలోనే అక్కడికి వచ్చిన దొంగ దాన్ని కాపాడేందుకు ప్రయత్నించాడు గానీ, ఆ సరికే జరగాల్సిందంతా జరిగిపోయింది. కోతి మనసును అదుపులో పెట్టుకోలేని కోతి అట్లా తన ప్రాణాలమీదికే తెచ్చుకున్నది!

నవ్వు!

ఉపాధ్యాయుడు: కోతి చెట్టుమీదికి ఎలా ఎక్కుతుంది, చెప్పు?

విద్యార్థి: నాకు తెలియదు సార్! అయితే ఈ ప్రశ్నకు జవాబు ఎవరికితెలుస్తుందో నాకు తెలుసు!

ఉపాధ్యాయుడు (నవ్వుతూ): అవునా?! ఎవరికి తెలుస్తుందో చెప్పు?

విద్యార్థి: కోతికి...!



మాయ మంత్రాల కథ

కథనం: సి. బాలమణికంఠ, ఐదవ తరగతి, లిబర్టీ కాన్వెంట్, చెన్నేకొత్తపల్లి.

అనగనగా ఒక ఊళ్ళో రాజు అనే పిల్లవాడు ఉండేవాడు. వాడు చాలా మంచివాడు. ఎవరు ఏ పని చెబితే అది చేసి పెడుతూ ఉండేవాడు. వాళ్ళ నాన్న ఎప్పుడో వాడు చిన్నగా ఉన్నప్పుడే చనిపోయాడట. ఇక వాళ్ళమ్మ ఎప్పుడూ జబ్బుతో మంచం మీద పడి ఉండేది. ఇంటి బాధ్యతలన్నీ రాజే మోసేవాడు. కూలి పని చేసేవాడు; వంట పని చేసేవాడు; అమ్మకు మందులు తెచ్చి ఇస్తుండేవాడు; అంట్లు తోమేవాడు. కొన్నాళ్లకి వాళ్ల అమ్మ చనిపోయింది. ఇక రాజు ఒంటరివాడు ఐపోయాడు.

ఆ సంవత్సరం వర్షాలు సరిగ్గా పడలేదు. రాజుకి పని దొరకటం కూడా కష్టం అయ్యింది. ఆ సమయంలో దూరదేశపు మనుషులు కొంతమంది వాళ్ళ ఊరికి వచ్చారు. నావల్లో సముద్రాలు దాటి వచ్చారట వాళ్ళు. రాజుకి వాళ్ళు నచ్చారు. వాళ్ళని బాగా గమనించి,

మంచి వాళ్ళేనని నిర్ధారణకు వచ్చాక వాడు వాళ్ళ దగ్గరికి వెళ్ళి, "నేనూ మీతో వస్తాను సార్!" అని బ్రతిమాలాడు.

"సరే, రా! కానీ మేం చెప్పిన పనల్లా చేయాల్సి ఉంటుంది- చాలా పని ఉంటుంది మరి" అన్నారు వాళ్లు, కొంచెం ఆలోచించి.



రాజు దానికి ఒప్పుకొని వాళ్లతో పాటు వెళ్ళాడు. కొత్త గనక వాడికి పడవ ప్రయాణం చాలా నచ్చింది. నావికులు వాడికి చాలా పనులు చెప్పేవాళ్ళు. వాడి పనికి మెచ్చుకొని వాళ్ళు కడుపునిండా అన్నం పెట్టటమే కాకుండా, డబ్బులు కూడా ఇవ్వటం మొదలుపెట్టారు.

అయితేనేమి, దురదృష్టం వెంటాడింది. ఒకరోజున సముద్రంలో తుఫాను చెలరేగింది. అలలు అంతెత్తున ఎగిరి పడ్డాయి- వాళ్ళున్న పడవ ముక్కలు ముక్కలైపోయింది!

పడవలో ఉన్నవాళ్లంతా ఎటు పోయారోతెలీదు- కానీ రాజు కళ్ళు తెరిచి చూసేసరికి వాడు ఒక ద్వీపం ఒడ్డున పడి ఉన్నాడు. లేచి, ఓపిక తెచ్చుకొని, నడక సాగించి కొద్ది దూరం వెళ్ళాడో, లేదో- వాడికి ఒక కొండ గుహ కనిపించింది. దొంగలు కొందరు ఆ గుహముందు నిలబడి ఏదో మంత్రం చదువుతున్నారు. వాళ్ళు ఆ మంత్రం చదవగానే గుహ తలుపులు తెరుచుకున్నాయి. దొంగలు ఆ గుహలోకి వెళ్ళి అందులోనుండి ఏవేవో మూటలు బయటికి తెచ్చుకొని గుర్రాలెక్కి నిముషాల్లో మాయం అయిపోయారు!

రాజు గుహ దగ్గరికి వెళ్ళి చూశాడు- తలుపులు వేరే ఏ విధంగానూ తెరచుకొనే మార్గం కనబడలేదు. అయితే బాగా వెతికితే పొదల వెనకగా ఒక చిన్న కిటికీ కనబడింది! రాజు ఆ

కిటికీలోంచి గుహలోపలికి తొంగి చూశాడు- గుహంతా ఖాళీగా ఉంది; కానీ గుహమధ్యలో ఒక స్తంభానికి కట్టిపడేసి ఉన్నాడు, ఒక ముసలాయన!

రాజు కిటికీలోంచి అరిచి, సైగలు చేసిన మీదట అతను నీరసించిన గొంతుతో తనను విడిపించమని వేడుకున్నాడు. కానీ ఎలాగ? ముసలాయనే రాజుకి ఆ మంత్రం చెప్పాడు. ఓ నాలుగైదు సార్లు ఆ ముసలాయనతోపాటు పలికేసరికి, అది నోటికి వచ్చేసింది, రాజుకి!

వాడు బయటికి వెళ్ళి ఆ మంత్రం చదివేసరికి, గుహ తలుపులు తెరచుకున్నాయి. రాజు నేరుగా గుహలోకి పోయి ముసలాయన్ని విడిపించాడు. ముసలాయన వాడికి ధన్యవాదాలు చెప్పుకొని, తన కథ చెప్పుకొచ్చాడు- ఆ దొంగల నాయకుడు తన శిష్యుడే. తననుండి కొన్ని మంత్రాలు నేర్చుకొని, చివరికి ఇప్పుడు వాడు దొంగ పనులు చేయటం మొదలుపెట్టాడు. తన ఇంటినే వాడు డబ్బులు దాచుకునే స్థలంగా వాడుకోవటం మొదలు పెట్టాడు! తను అట్లాంటి పనులు చేయవద్దనే సరికి, వాడికి కోపం వచ్చింది. తనను కట్టి పడేసి, ఇంట్లో దాచుకున్న సొమ్మునంతా దూరంగా ఉన్న కోటకు ఎత్తుకెళ్ళాడు.

"నువ్వు మంచివాడివి లాగా ఉన్నావు నాయనా! నేను నీకు మూడు టోపీలు ఇస్తాను- ఇదిగో ఈ ఆకుపచ్చ రంగు టోపీ పెట్టుకుంటే నువ్వు మాయం అవుతావు. ఎర్రది పెట్టుకుంటే నువ్వు ఐదు రెట్లు పెద్దగా అవుతావు- పదింతలు శక్తి వచ్చేస్తుంది నీకు. ఇక పసుపు పచ్చ రంగు టోపీ పెట్టుకున్నావంటే మళ్ళీ మామూలు స్థితికి వచ్చేస్తావు" అని చెప్పి మూడు టోపీలు చేత పెట్టాడు ముసలాయన. "ఇదిగో, ఈ దీవికి అవతలివైపున ఏడెనిమిది పడవలుంటాయి. ప్రస్తుతం అవి ఆ దొంగల ఆధీనంలో ఉన్నాయి- వాళ్ళకి కనబడకుండా ఒక పడవను సాధించుకోగలవేమో చూడు- ఇక వెళ్ళిరా!" అంటూ.

ముసలాయన దగ్గర ఆ టోపీలు తీసుకొని, ధన్యవాదాలు చెప్పి బయలుదేరాడు రాజు. ఆకుపచ్చరంగు టోపీ పెట్టుకొని ఆ ద్వీపంలో

నడచి వెళ్తుంటే తనకి కొన్ని ఎలుగుబంట్లూ, అడవి పందులూ ఎదురయ్యాయి- కానీ వాటికి రాజు కనబడనే లేదు!



అయితే పడవల దగ్గరికి చేరుకునేసరికి రాజుకి భయం వేసింది- ఏమంటే దొంగలు ఆ పడవలన్నిటిలోనూ సామాన్లు ఎక్కిస్తున్నారు. చూడగా ఒక పడవలో తక్కువమంది దొంగలు ఉన్నారు- రాజు ఆ పడవలోకి ఎక్కి నిల్చొని, పచ్చటోపీ తీసేసి, ఎర్రటోపీ పెట్టుకున్నాడు. చూస్తూండగానే వాడు ఐదు రెట్లు పెద్దగా అయిపోయాడు! పది రెట్ల బలం వచ్చేసింది వాడికి.

వాడు పెద్దగా అరుస్తూ దొంగల మీదికి దూకే సరికి దొంగలంతా ఎక్కడివాళ్ళు అక్కడ పారిపోయారు. కొందరు దొంగలు వాడితో యుద్ధానికి దిగారు- వాడు ఎక్కడి వాళ్లను అక్కడ విసిరేసి హడావుడి చేశాడు. దాంతో దొంగలందరూ వాడు ఎక్కిన పడవని వదిలేసి, మిగిలిన పడవల్లోకి దూకి గబగబా తెడ్లు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

రాజు నవ్వుకొని, పసుపు పచ్చ టోపీ పెట్టుకున్నాడు. దాంతో వాడికి తన మునుపటి రూపం వచ్చేసింది. వాళ్ళు వదిలేసి వెళ్ళిన పడవలో దొంగ సొత్తు ఇంకా చాలానే ఉంది- చూస్తూ చూస్తూ అంత సొమ్మును తీసుకెళ్ళటం ఏమంత ఇష్టం కాలేదు రాజుకు. అందుకని వాడు పడవని వేరే చోట భద్రంగా కట్టేసి, మెల్లగా నడచుకుంటూ తనకు ఇంతకు ముందు కనబడ్డ గుహకోసం వెతుక్కుంటూ వెళ్ళాడు. ఎంత వెతికినా వాడికి ఆ గుహ కనబడలేదు; తనకు టోపీలిచ్చిన తాతా కనబడలేదు! కంగారుగా జేబులో చూసుకుంటే అసలు ఆ టోపీలే కనబడలేదు!

వాడికి నవ్వూ, ఏడుపూ ఒకేసారి వచ్చాయి. అంతలోనే వాడికి ఇంకో ఆలోచన వచ్చి, ఎక్కడ లేని బాధా వేసింది- 'తన పడవైతే భద్రంగానే ఉన్నది గద?!' వాడు గబగబా వెళ్ళి చూసుకుంటే, అది మటుకు ఇంకా భద్రంగానే ఉంది.

వాడు సంతోషంగా ఆ పడవనెక్కి, త్వరలోనే తనకు నచ్చిన తీరం చేరుకున్నాడు. అక్కడ వ్యాపారం మొదలు పెట్టుకొని సుఖంగా జీవించాడు.

నవ్వండి!

ఎవరిది?!

రవి: గడియారం చాలాబాగుంది. ఫారిన్ దా?

వెంగళప్ప: కాదు నాదే...!

విదేశ గమనం!

రవి: మాచెల్లి పుట్టిన రోజు బహుమతిగా నేను ప్రపంచ పటం ఒకటి కొనివ్వాలి.

సోము: ప్రపంచ పటమా?! అదే ఎందుకు?

రవి: మా చెల్లికి దేశ విదేశాలు చూడాలని ఉన్నదట, మరి!

చిట్టి తల్లి!

చిట్టి: అమ్మా! ఇవాళ్ళ బళ్ళో ఓ చిన్న పాప పడిపోతే అందరూ నవ్వారు.

అమ్మ: అయ్యో, అట్లా నవ్వకూడదమ్మా, తప్పు.

చిట్టి: నేను అస్సలు నవ్వలేదమ్మా!

అమ్మ: అవునా, నువ్వు చాలా మంచి పాపవి. నువ్వెందుకు నవ్వలేదో చెప్పు!

చిట్టి: క్రిందపడింది నేనే కదా, అందుకని!



భయం

రచన: బి.వేణుగోపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, లేపాక్షి, అనంతపురం జిల్లా.

లేపాక్షి బడి హాస్టల్‌లో మొత్తం 468 మంది విద్యార్థులు ఉంటారు. అందరూ తినేందుకు వీలుగా ఒక భోజనశాల, ఉపాధ్యాయులకు-విద్యార్థులకు వేరువేరుగా వసతి గృహాలూ, పిల్లలు స్వేచ్ఛగా తిరిగేందుకు, చదువుకునేందుకు, ఆడుకునేందుకు తగిన వాతావరణం- ఇవన్నీ ఉంటాయి.

హాస్టల్‌లో పనిచేసే బాలయ్య రోజూ ప్రొద్దునే సైకిల్‌మీద వచ్చేవాడు. పగలంతా పని చేసాక, సాయంత్రం చీకటి పడుతుండగా తమ ఊరికి తిరిగి వెళ్ళేవాడు.

హాస్టల్లో ఉండే వేణు, గోపి, కృష్ణ ముగ్గురూ ప్రాణ స్నేహితులు. ముగ్గురూ కలసి మెలసి ఉండేవాళ్ళు ఎప్పుడూ.

బాలయ్య ఇంటికి వెళ్ళేముందు ఎప్పుడూ వేణుతో ఏవో కబుర్లు చెప్పి వెళుతుండేవాడు.

ఒకసారి అతను చెప్పాడు:

"మీరు మొన్న సెలవులకు ఇంటికి వెళ్ళారు కదా, అప్పుడు హాస్టల్లో ఎవ్వరూ లేరు. నేను వచ్చి, మధ్యాహ్నం అవ్వగానే ఇట్లా ఆవుకు గడ్డి కోసుకొచ్చి ఆవుకి వేసి, అట్లా ఆ ప్రక్కనే ఉన్న చింతచెట్టు క్రింద కూర్చున్నాను. ఆవు అక్కడక్కడా పెరిగిన గడ్డిని కొంచెం,నేను తెచ్చిపెట్టిన గడ్డిని కొంచెం-అట్లా తింటూ ఉంది. చెట్టుకి బాగా ఆనుకొని కూర్చున్నానేమో, మరి చల్లగాలికి హాయిగా నిద్రలోకి జారుకున్నాను నేను. కొంచెం సేపు గడిచాక, నాకు దగ్గర్లోనే ఏదో గజ్జెల చప్పుడు వినబడి, హటాత్తుగా మెలకువ వచ్చింది. చూద్దునుకదా, గాలి దుమారం!

సుడిగాలి రేగి, దగ్గర్లో ఉన్న దుమ్ము, మట్టి, కాగితాలు, చెత్త, చెదారం- అంతా గింగిరాలు కొట్టుకుంటూ నా మీదుగా ఎగిరిపోయినై! అది పోయాక చూస్తే, ఈ మైదానం మొత్తం నిర్మానుష్యం అయిపోయి ఉన్నది! నాకు చాలా భయం వేసింది. ఈ ప్రాంతాల్లో దయ్యం తిరుగుతుంటుందని విన్నానుగానీ, దాన్ని అంత దగ్గరగా చూసింది ఆ రోజునే!



ఇంకా మూడునాళ్లలో అమావాస్యకదా, దయ్యాలతో జాగ్రత్తగా ఉండాలి మీరుకూడా. ఊరికే అక్కడా ఇక్కడా తిరగకండి" అని. ఈ సంగతి చెప్పాక, బాలయ్య మామూలుగానే ఇంటికి వెళ్ళిపోయాడు.

వేణుకి దయ్యాలంటే నమ్మకంలేదు గానీ, కథల్లో వాటిని గురించి చదివీ చదివీ వాటిని ఎలాగైనా చూడాలని ఒక కోరిక ఉండేది. అందుకని అతను ఈ సంగతిని వెంటనే గోపికి, కృష్ణకీ చెప్పాడు. అతను చెప్పింది విని గోపి కొంచెం భయపడ్డాడు, కానీ కృష్ణ మాత్రం

చాలా సంతోషపడ్డాడు. "నాక్కూడా దయ్యాన్ని చూడాలని ఉందిరా" అన్నాడు.



వేణు, కృష్ణ ఇద్దరూ "మేమున్నాం, నీకు ఏమీ కాదు, మేం నిన్ను కాపాడతాం- ముగ్గురం అమావాస్యరోజు ఇక్కడికి వచ్చి దయ్యాన్ని పలకరించి పోదాం" అని రకరకాలుగా చెప్పాక, గోపి కూడా వాళ్లతోబాటు వెళ్ళేందుకు ఒప్పుకున్నాడు.

మూడో రోజు రాత్రి అమావాస్య. ఆరోజు రాత్రి చీకటి పడ్డాక, పిల్లలు అందరూ భోజనాలు చేసి పడుకున్న తర్వాత, మిత్రులు ముగ్గురూ నిశ్శబ్దంగా బయట పడ్డారు.

నక్షత్రాల వెలుగులో నేల ఎర్రగా-నల్లగా స్తబ్దంగా ఉన్నది. చెట్లు గాలికి మెల్లగా ఊగుతున్నాయి. ఎక్కడా ఒక్క దీపం కూడా లేదు. వేణు చేతిలో ఒక టార్చిలైటు ఉన్నది గానీ, అది వేస్తే మిగతా పిల్లలంతా చూసే ప్రమాదం ఉన్నది కదా, అందుకని దాన్ని వేయకుండా ఊరికే చేతిలో పట్టుకొని ఉన్నాడు.

పిల్లలు ముగ్గురూ ఒకరి వెనక ఒకరు నడుస్తూ పోయారు- ముందు వేణు, మధ్యలో గోపి, అందరిలోనూ చివరగా కృష్ణ.

"ఎటు వెళ్దాంరా?" అడిగాడు కృష్ణ.

"ఎటో ఎందుకు, ఆ చింతచెట్టు దగ్గరికే వెళ్దాం. బాలయ్యకు దయ్యం కనిపించింది అక్కడేగా?" అన్నాడు వేణు.

గోపి ఏమీ మాట్లాడలేదు. దయ్యం గురించి ఆలోచించిన కొద్దీ వాడికి ఊపిరి ఆడనట్టుగా ఉంది.

వాళ్ళు చింతచెట్టు దగ్గరికి చేరుకుంటున్న కొద్దీ మారిన వాతావరణం మరింత బలంగా అనుభూతిలోకి వస్తోంది వాళ్లకి. నేల అంతా

చిత్తడి చిత్తడిగా ఉంది. అంతలో వేణు కాళ్ళకి ఒక ముళ్ళ పొద తట్టుకున్నది- అతను ఒకసారి టార్చిలైటును వేసి చూశాడు..తన కాళ్లకి ఎదురుగా ముళ్ళపొద- ఆరడుగుల వరకూ విస్తరించి ఉన్నది. వాళ్ళిప్పుడు చింత చెట్టుకు ఏమంత దూరంగా లేరు.. గాలికి చింత చెట్టు కొమ్మలన్నీ బాగా ఊగుతున్నాయి.

"ఊ, గాలి బాగానే వీస్తోంది. రండి అటువైపుగా వెళ్ళాలి చింతచెట్టు దగ్గరికి-" అన్నాడు వేణు టార్చిలైటును అటుగా చూపుతూ.

"టార్చిలైటు వేయకు- మనం వస్తోంది ఎందుకు? వెలుతురును చూస్తే దయ్యాలు పారిపోతాయి" గుసగుసగా కసిరాడు కృష్ణ.

మిత్రులు ముగ్గురూ చీకట్లోనే చింత చెట్టును చేరుకొని, అక్కడ నేలమీద పరచుకొన్న వేరు ఒకదాని మీద కూర్చున్నారు దగ్గర దగ్గరగా.

అంతలో గాలి వేగం పెరిగింది. మేఘాలు అన్నీ లేపాక్షి వైపుకే వచ్చి చేరుకుంటున్నట్లు తోచింది. ఓ మెరుపు మెరిసింది ఆకాశంలో. ఆ మెరుపు వెలుగులో చింతచెట్టు కొమ్మలు ఊగటం కనిపించింది.

అంతలో ఓ వైపునుండి గజ్జెల శబ్దం వినబడింది. మిత్రులు ముగ్గురూ ఒకరికొకరు దగ్గరగా జరిగారు.

శబ్దం వినబడిన వైపుకు చూసినై ముగ్గురి కళ్ళూ..ఏమీ కనబడలేదు..

అంతలో మరో మెరుపు మెరిసింది. ఈసారి భడభడమంటూ ఉరిమింది కూడా.

మిత్రులకు ముగ్గురికీ ఇప్పుడు స్పష్టంగా కనిపించాయి- అంత చీకట్లోనూ మిలమిలా మెరుస్తున్న కళ్ళు రెండు! గల్..గల్.. మనే గజ్జెల మోత బలంగా వినిపిస్తోంది. దయ్యం బుస్..బుస్ మని ఊపిరి పీల్చుకోవటం- వదలటం కూడా వినబడిందిప్పుడు!

దట్టమైన ఆ చీకట్లో మిత్రులు ముగ్గురూ ఒకరికొకరు కూడా కనబడటం లేదు. ముగ్గురూ చెమటలతో తడిసిపోయారు. అందరికంటే ముందున్న వేణు కొయ్యబారిపోయాడు, అందరికంటే వెనక ఉన్న కృష్ణ ఒక అడుగు వెనక్కి వేశాడు.

మధ్యలో ఉన్న గోపి అయితే స్పృహకోల్పోయి దబ్బునక్రిందపడిపోయాడు!

మిత్రుడుక్రిందపడిపోవటం చూసి వేణు, కృష్ణ ఇద్దరూ బొమ్మల్లాగా స్తంభించి పోయారు: "ఇప్పుడు క్రిందికి వంగి గోపిని లేవనెత్తి తీసుకుపోవటమా, లేక అక్కడే నిల్చొని దయ్యం అంతు చూడటమా?"

గజ్జెల చప్పుడు ఇప్పుడు మరింత దగ్గరయింది.. మెరుస్తున్న కళ్ళు రెండూ వాళ్ల దగ్గరికే వచ్చేస్తున్నాయి..ఏదో వేణు చొక్కా పట్టుకొని అటూ ఇటూ లాగింది. గబుక్కున తేరుకున్న వేణు టార్చ్ లైటు వేసాడు-

ఆ వెలుతురులో తమకు ఎదురుగా ఉన్నదేమిటో చూసి మిత్రులిద్దరూ నిర్ఘాంత పోయారు: అది దయ్యంకాదు- బాలయ్య ఆవు!

బాలయ్య ఆవు కళ్ళు చీకట్లో మెరుస్తున్నాయి. దాని కొమ్ములకు కట్టిన గజ్జెలు ఘల్లు ఘల్లుమని శబ్దం చేస్తున్నాయి. అది వచ్చి వేణు చొక్కాను పట్టుకొని లాగుతున్నది.

మిత్రులిద్దరూ ఒక్కసారిగా పగలబడి నవ్వారు.

ఇక వేణు అక్కడే నిల్చొని ఉండగా కృష్ణ వెళ్ళి ఒక చెంబుతో నీళ్ళు తీసుకొచ్చాడు. వేణు, కృష్ణ ఇద్దరూ ఆ నీళ్ళని గోపి మొహం మీద చల్లారు. కొంత సేపటికి తేరుకున్న గోపి లేచి కూర్చొని "దయ్యం మనల్ని ఏమీ చేయలేదా?" అని అడిగాడు భయం భయంగా.

వేణు, కృష్ణ ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకొని నవ్వి, వాడికి నీళ్ళు ఇచ్చి త్రాగించి, "అది దయ్యం కాదురా, అక్కడ ఉన్నది- ఇదిగో- ఈ బాలయ్య ఆవు! నల్లటి ఆవు కదా, అందుకని అది మనకు చీకట్లో కనబడలేదు- అంతే!" అని చెప్పి వాడినీ నవ్వించారు.

"దయ్యాలు బయట ఎక్కడో లేవురా, అవి మనలోనే ఉన్నాయి-భయం చాటున దాక్కుని" అని నవ్వుకున్నారు మిత్రులు ముగ్గురూ, బాలయ్య ఆవును నిమురుతూ.

కెల్విన్ డో

యువ కెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం డాట్ నెట్



"నా పేరు కెల్విన్ డో. మా దేశం సియర్రా లియోన్. నాకు కొత్త వస్తువులు కనిపెట్టడం అంటే ఇష్టం" - ఇదీ కెల్విన్ అనే పదిహేడేళ్ళ అబ్బాయి తనని తాను పరిచయం చేసుకునే విధానం. స్థానికులు ఇతన్ని డి.జె.ఫోకస్ అని పిలుస్తారు. ఇతని ప్రతిభని గుర్తించిన పాశ్చాత్య పాత్రికేయులు "బాల మేధావి, ఇంజనీర్" అంటారు.

కెల్విన్ పశ్చిమ ఆఫ్రికాలోని సియర్రా లియోన్ అన్న దేశానికి చెందిన పదిహేడేళ్ళ కుర్రవాడు. గత ఏడాది ఎం.ఐ.టీ. వంటి ప్రపంచ విఖ్యాత విశ్వవిద్యాలయం వారి ఆహ్వానాన్ని అందుకుని అక్కడ ఒక ఇంజినీరింగ్ ప్రాజెక్టు చేయడం ద్వారా చాలా పేరు తెచ్చుకున్నాడు.

ఇంతకీ ఇతను ఏమి చేస్తూ ఉంటాడు? చెత్తబుట్టల్లో దొరికే పాత ఎలక్ట్రానిక్ పరికరాలలోని భాగాలతో అతను తన సొంత పరికరాలు తయారు చేసేస్తూ ఉంటాడట. సియర్రా లియోన్‌లో వీళ్ళు నివసించే ప్రాంతంలో విద్యుత్ సరఫరా సరిగా ఉండదు. వారానికొకసారి లైట్లు వెలుగుతాయంట!

ఇలాగ రోజంతా చీకట్లో ఉంటారు కనుక, తనంతట తానుగా కెల్విన్ ఒక బ్యాటరీ తయారు చేశాడట విద్యుత్ కోసం! ఏదన్నా పరికరం కనిపిస్తే, అదెలా పనిచేస్తుంది? అని తెరిచి చూడ్డం, తెలుసుకోవడం కెల్విన్ కి అలవాటు. సొంతంగా ఒక ఎఫ్.ఎం. ట్రాన్స్మిటర్ తయారు చేశాడు. తరువాత, స్థానిక యువతకు తమ అభిప్రాయాలు వెలిబుచ్చే మార్గం చూపడానికీ, స్థానిక సమస్యలు చర్చించుకోవడానికీ, ఏకంగా తన సొంత రేడియో స్టేషన్ రూపొందించాడు. రేడియో స్టేషన్‌కి కరెంటు కావాలి కనుక సొంతంగా ఒక జనరేటర్ రూపొందించాడు!



కరెంటు కూడా సరిగా లేని సియర్రా లియోన్ వంటి దేశంలో పెరిగిన అబ్బాయి అన్ని పరికరాలు ఎలా చేసాడు? ఎవరో బాగా శ్రద్ధగా అతనికి ఇవన్నీ నేర్పారు అనుకునేరు. అతను చేసేవి చాలామట్టుకు తాను సొంతంగా తెలుసుకున్నవే. ఒకసారి ఇన్నోవేట్ సలోనే ఐడియా కాంపిటీషన్ అన్న పోటీలో పాల్గొని తుక్కు కింద పారేసే సామగ్రితో కెల్విన్ ఒక జనరేటర్ రూపొందించడంతో, అతనికి అమెరికా వెళ్ళడానికి ఆహ్వానం వచ్చింది. అక్కడ ప్రముఖులని ఎందరినో కలిసాడు కెల్విన్. ఎం.ఐ.టీ. వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే పరిశోధకులతో చర్చించి తన పరికరాలను ఇంకా మెరుగుపరుచుకోవడం గురించి సలహాలు తీసుకున్నాడు. ఎం.ఐ.టీ విశ్వవిద్యాలయంలో తరుచుగా నిర్వహించే విజిటింగ్ ప్రాక్టీషనర్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆహ్వానింపబడ్డ అతి పిన్న వయస్కుడు కెల్వినే.

అక్కడ నేర్చుకున్నవన్నీ తిరిగి తన దేశం వెళ్ళి తన జట్టుతో కలిసి తమ కొత్త పరికరాల రూపకల్పనకి వాడుకోవాలని కెవిన్ ఆలోచనట. తన ఈడువారిలో ఇలా మన సమస్యలని మనమే పరిష్కరించుకోవాలి అన్న అవగాహన కలిగించి, వారిలోని సృజనాత్మకతకు పదును పెట్టేలా ప్రోత్సహించడం అతని ఆశయమట. గాలిమరని రూపొందించి విద్యుచ్ఛక్తి సృష్టించడం అతని తదుపరి లక్ష్యాల్లో ఒకటి. ఇదివరలో, దాదాపు రెండేళ్ళ క్రితం విలియం కంకంబ్వా అన్న అబ్బాయి గురించి ఈ పత్రికలోనే రాశాను చూశారా? అతని కథే గుర్తు వచ్చింది నాకు కెల్విన్ గురించి చదువుతూ ఉంటే. తన దేశమన్నా, ప్రజలన్నా తనకెంతో ఇష్టమనీ, తను భవిష్యత్తులో శాస్త్రవేత్తై సియర్రా లియోన్ దేశంలోని పరిస్థితులు మెరుగు పరిచేందుకు కృషిచేస్తాననీ అంటున్నాడు కెల్విన్. ఎంతో పరిమిత వనరులున్న సియర్రా లియోన్ వంటి దేశంలో ఒక చిన్న ఊరిలో పెరిగిన కెల్విన్ తనంతట తానుగా ఇన్ని చేయగలుగుతున్నాడు అంటే భలే ఉంది కదూ!?

బొమ్మకు కవిత రాయండి!


సృజన: శ్రీమతి జి.లలిత, తెలుగు4 కిడ్స్ డాట్ కాం.

ఈ బొమ్మను చూడండి; ఈ కవితను చదవండి:




పిల్లలు ఆడుకునే తోటలోనే
పెద్దలు నడవడానికో బాట
బాతులు నడుస్తుంటాయి ఆ త్రోవలో
కొలను ఒకటుంది కదా మరి ఆ చోటులోనే

బాట మధ్యలో వంతెన ఒకటుంది
కొలను దాటడానికి అది ఉపయోగపడుతుంది
దానిక్రింద నీళ్ళలో తిరుగాడుతుంటాయి
తిండి కోసం తాబేళ్ళు కొన్ని



ఆ తోటకి వచ్చినప్పుడు ఒకసారి
పెద్దవాడు తీశాడు ఒక బొమ్మ
చిన్నవాడు వేశాడు ఒక బొమ్మ
వాటిని దాచుకుంది గుర్తుగా వాళ్ళ అమ్మ !

మరింకేం, మీరూ రాసి పంపండి ఓ బొమ్మకో చిట్టి కవిత !



తూర్పు దేశంతో వ్యాపారం

భారత దేశపు జానపద కథ

కథనం: చక్రి, "సమాలోచన" *"బొమ్మలు" : రాము, బియఫ్ఏ విద్యార్థి*

మగధ రాజ్యాన్ని ప్రసేనుడు పాలించే కాలంలో వరహాలయ్య అనే వర్తకుడు ఒకడు ఉండేవాడు. అతనికి ఎన్నో వ్యాపారాలు ఉండేవి. సింహళ దేశంతో పాటు పలు దేశాలకు సుగంధ ద్రవ్యాలు ఎగుమతి చేయడం వాటిలో ప్రధానమైంది. తను సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని దాన ధర్మాలకోసం వినియోగించేవాడు వరహాలయ్య. వ్యాపారం కూడా ధర్మంగా చేసే వాడు; దాంతో అతనికి చక్కని లాభాలతో పాటు, మంచివాడనే పేరుకూడా వచ్చింది.

అలా కొన్నాళ్ళు గడచిన తరువాత, అకస్మాత్తుగా అతనికి జబ్బు చేసింది. ఎందరో వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు; కానీ

జబ్బు తగ్గలేదు. ఇక తనకు రోజులు సమీపించాయని అర్థమైంది వరహాలయ్యకు . వెంటనే కబురుపంపి, కాశీలో విద్యను అభ్యసిస్తున్న తన ఒక్కగానొక్క కుమారుడు రామయ్యను హుటాహుటిన రప్పించాడు. తండ్రికి తగిన కొడుకు రామయ్య. అందరితోటీ స్నేహభావంతో మెలిగేవాడు. కబురు అందగానే ఆఘమేఘాలపైన ఇంటిదగ్గర వాలాడు. మంచంమీద ఉన్న తండ్రిని చూసి తట్టుకోలేక పోయాడు.దుఃఖం పొంగుకొచ్చింది. కానీ తనను తాను సంభాలించుకున్నాడు. కర్తవ్యం కళ్ళముందు కనిపించింది. చనిపోయే ముందు తండ్రి చెప్పిన విషయాలు స్థూలంగా, ఇవి:

"బాగా లాభసాటిగా ఉండే సుగంధ ద్రవ్యాల ఎగుమతి వ్యాపారం విడిచి పెట్టద్దు. పేదలను దోచుకొని డబ్బు సంపాదించడం తప్పు. సంపాదించిన దాంట్లో కొంత శాతం తప్పనిసరిగా పేదలకు దానం చెయ్యాలి. తూర్పున ఉన్న దేశంతో వ్యాపారం వద్దు".

తెలివైనవాడు కావడంతో తండ్రి చెప్పిన విషయాలను త్వరగానే ఆకళింపు చేసుకున్నాడు రామయ్య. నాలుగు సలహాలనూ ఆచరణలో పెట్టాడు. వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లసాగింది. తండ్రి అప్పగించిన వ్యాపారం త్వరలోనే పది రెట్లయింది. ఆయన సలహా ప్రకారమే బీద సాదలకు చేదోడు వాదోడుగా ఉంటూ 'తండ్రికి తగిన కొడుకు'అనిపించుకున్నాడతను.



అయినా ఒక విషయంలో మాత్రం సంతృప్తిగా లేదు అతనికి- "తండ్రి చనిపోతూ 'తూర్పు దేశంతో వ్యాపారం చెయ్యొద్దు' అని ఎందుకు

అన్నాడు?"

తూర్పు దేశం గురించి వాకబు చేసి చూసాడు రామయ్య. కానీ సరైన సమాచారం ఎవ్వరూ ఇవ్వలేదు. దాంతో అతని అసంతృప్తి రోజురోజుకీ మరింత ఎక్కువయింది. ఇక లాభం లేదని, మంచి రోజు చూసుకొని ఓడ నిండా సరుకులు నింపుకొని బయలుదేరాడు.

కొద్ది రోజులు ప్రయాణించాక ఓడ తూర్పు దేశం చేరుకున్నది. సామాన్లు ఇంకా క్రిందికి దింపకనే నగరంలోకి వెళ్ళి అంతటా తిరిగి చూశాడు రామయ్య. ఎక్కడా ఏదీఅంత తేడాగా ఏమీ అనిపించలేదు. అంతా బాగానే వున్నట్టు తోచింది. భయ పడాల్సిన అవసరం కనపడలేదు. సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేసే వర్తకులు ఎక్కడ ఉన్నారో వాకబు చేసి, వాళ్లను కలుసుకొని తన సరుకు నమూనాలను చూపించి మంచి బేరం కుదుర్చుకున్నాడు. సరుకు మొత్తం అమ్ముడయింది; మంచి లాభం కూడా వచ్చినట్లయింది.

ఆ వర్తకులందరూ కూడా చక్కగా, మర్యాదగా, స్నేహంగా మెసిలారు. ఒప్పందాలన్నీ పూర్తయాక, తమతో పాటు భోజనం చేసిగానీ వెళ్ళటానికి వీల్లేదని పట్టుబట్టారు అందరూ. వాళ్ళు అంతగా అభ్యర్థించేసరికి రామయ్య కూడా కాదనలేక పోయాడు. ఐతే 'మాంసాహార విందుకు అవసరమైన కోడి, చేపలు కొనుక్కొచ్చే బాధ్యత మటుకు నాదే' అని వాళ్ళని ఒప్పించాడు. ఆవిధంగా రామయ్య స్వయంగా బజారుకు వెళ్ళి కొనుక్కొచ్చిన కోడి, చేపలతో విందు భోజనం ముగిసింది.



ఐతే ఇటు విందు ఇంకా ముగిసిందో,లేదో-

అటు రాజ భటులు వచ్చేసి రామయ్యను చుట్టుముట్టారు. క్షణాల్లో రామయ్యను ఖైదు చేసి చెరసాలలో బంధించారు! ఏమవుతోందో అర్థమయ్యేలోపలే యిదంతా జరిగిపోయింది.

మరుసటి రోజున రాజుగారి ముందు ప్రవేశ పెట్టారు అతన్ని . రామయ్య పై హత్యానేరం మోపబడింది! రామయ్యకు మతి పోయినట్లయింది. "నాకేమీ తెలియదు;నేను అమాయకుడిని" అని మొత్తుకున్నాడు.

కానీ "సాక్ష్యాలన్నీ మరొకలా ఉంటే నువ్వు అట్లా అంటావేమిటి? నోరు మూసుకో!" అని హుంకరించారు మంత్రిగారు.

"ఇంతకీ నేను ఎవరిని చంపాను? నాపైన ఈ ఆరోపణ చేసిందెవరు?" అడిగాడు రామయ్య.

అప్పుడు తెలిసింది- తనకు కోడిని,చేపని అమ్మిన దుకాణపు యజమానే, తనపై ఈ హత్యా నేరాన్ని మోపాడు. రామయ్య తన తల్లిని, తండ్రిని హత్య చేసాడని అతని ఆరోపణ! అతను రామయ్యకు కోడిని,చేపను తినేందుకు అమ్మలేదు; కేవలం పెంచుకునేందుకు ఇచ్చాడట- అంతే. 'ఆ కోడి, చేప పూర్వ జన్మలో అతని తల్లిదండ్రులు. వాటిని అతను ఇంతకాలమూ ఎంతో ప్రేమగా పెంచుకుంటూ వస్తున్నాడు. అట్లాంటి తన తల్లి తండ్రులను ఈ రామయ్య వండుకొని తిన్నాడు! అతి క్రూరంగా హత్య చేసాడు!' అని సభలో ఆరోపిస్తుంటే విని, రామయ్య నిశ్చేష్టుడైపోయాడు. 'కోడేమిటి, చేపేమిటి, పూర్వజన్మలో తల్లిదండ్రులవ్వటం ఏమిటి, ఈ జన్మలో పెంచుకోవటం ఏమిటి, అంతా మోసం, ఇదంతా ఒక కుట్ర- ఇందులో దుకాణపు యజమాని ఒక్కడే కాదు; తననుండి సరుకులు కొన్న వర్తకులకు కూడా హస్తముంది!' అని రామయ్య మనసు ఆక్రోశించింది. అయితే బయటికి

ఏమనాలో అతనికి అర్థం కాలేదు. ఏమంటే ఏమవుతుందో తెలీదు. 'అన్యాయంగా తను ఇక్కడ ఇరుక్కున్నాడు- అందుకేనేమో, తన తండ్రి ఈ దేశంతో వ్యాపారం వద్దన్నది! ఈ వ్యాపారస్తుల ఎత్తుగడలు తన తండ్రికి తెలుసు! తను ఇప్పుడు ఏం చేయగలడు? అయినా ఇంకా రాజుగారు ఏమీ అనలేదు కదా?

ఆయనైనా న్యాయం చేస్తారేమో' అని ఆశగా ఎదురుచూశాడు కొంతసేపు.



కానీ ఆ దేశపు రాజుగారు మహా మూర్ఖుడు. తన దేశపు వ్యాపారుల మోసాలకు వత్తాసు పలకటం తప్ప, అతని మనసులో న్యాయం, ధర్మం లాంటివి ఏమీ లేవు. కొద్ది సేపట్లోనే ఆయన నిర్ణయించేశాడు- "ఇందులో ఆలోచించడానికి ఏమీ లేదు- హత్య విషయం స్పష్టం గా ఉంది. నిందితుడికి శిక్ష తప్పదు" అని!

ఇట్లాంటి సందర్భాలలో దేశపు ఆచారం ఒకటున్నది- దాని ప్రకారం 'తల్లిదండ్రులను కోల్పోయిన దుకాణదారు చాలా దు:ఖంలో ఉంటాడుకదా, అందుకని ఆ హత్య చేసిన రామయ్య ఏదో ఒక విధంగా దుకాణదారును సంతోషపెట్టాలి. అట్లా అతను సంతోషపెట్టగల్గితే సరి- లేదా అతనికి మరణశిక్ష తప్పదు'.

రాజుగారు దుకాణ దారును అడిగారు- "నీకు దు:ఖంగా ఉందా?" అని.

"అవును ప్రభూ, విపరీతమైన దు:ఖం!" అన్నాడు వాడు, దైన్యం నిండిన ముఖంతో.

రామయ్య దుకాణదారును అనేక విధాలుగా ప్రార్థించాడు. దయచూడమన్నాడు. అయినా వాడి మనసు ఏమాత్రం కరగలేదు. "నాకు ఇంకా చాలా దు:ఖంగా ఉంది" అనే అంటూ వచ్చాడు వాడు.

చివరికి తను ఆ దేశంలో సంపాదించుకున్న సొమ్ము మొత్తాన్నీ ఇవ్వజూపాడు రామయ్య. అయినా కొట్టు యజమాని తనకు సంతోషం కలగలేదన్నాడు.

"ఎన్నో సంవత్సరాలు నీకు కట్టు బానిసలా

పనిచేస్తాను" అని వాగ్దానం చేసాడు రామయ్య.

దుకాణదారు కరగలేదు.

"నా వంటి మీద ఉన్న ఆభరణాలన్నీ సమర్పించుకుంటాను" అన్నాడు. అయినా ఫలితం దక్కలేదు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు రామయ్యకు. ఆ దుర్మార్గుడి మనసును కరిగించమని ముక్కోటి దేవుళ్ళకూ మొక్కుకున్నాడు.

అయినా దేవతలు ఎవ్వరూ ప్రత్యక్షం అవ్వలేదు.

అంతలో రాజు గారి కొడుకు, పది సంవత్సరాలవాడు- ఎక్కడినుండో ఊడి పడ్డాడు. ఒక్కసారిగా అక్కడి వాతావరణం అంతా తేలిక పడ్డట్లయింది. చిలిపిగా నవ్వుతూ, సంతోషంగా గంతులువేస్తూ రాజకుమారుడు సింహాసనం ఎక్కి తండ్రి ఒడిలో కూర్చున్నాడు. రాజుగారి మెడలోని ముత్యాల దండని పట్టుకొని లాగటం మొదలు పెట్టాడు.

వెంటనే అవకాశాన్ని దొరకబుచ్చుకున్నాడు రామయ్య. తన మెడలో ఉన్న వజ్రాల హారాన్ని తీసి చటుక్కున రాజకుమారుని మెడలో వేసాడు. రాజకుమారుడు ఆ హారాన్ని చూసుకొని మురిసిపోయాడు. సభికులందరూ సంతోషంగా చప్పట్లు కొట్టారు.

తన ఎదురుగా ఉన్న దుకాణదారునే చూస్తున్నాడు రామయ్య . వాడు కూడా సంతోషంగా నవ్వుతున్నాడిప్పుడు. వెంటనే "ఏమయ్యా, ఇప్పుడు నీకు సంతోషం కలిగిందా?" అని సూటిగా ప్రశ్నించాడు రామయ్య, అతన్ని.

హటాత్ పరిణామంతో ఖంగు తిన్నాడు కొట్టు యజమాని. అతని నోట్లో పచ్చి వెలగ కాయ పడినట్లు అయింది. 'కాదు-సంతోషంగా లేను'అంటే రాజుగారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది; మరి 'ఔను-సంతోషంగా ఉన్నాను' అంటే రామయ్య రూపంలో దొరికిన బంగారు బాతు చేజారి పోతుంది : ఏం చెయ్యాలో పాలుపోక ఊరికే నిల్చుండిపోయాడతను.

పరిస్థితి తనకు అనుకూలంగా మారిందని గమనించిన రామయ్య అదే ప్రశ్నను మళ్ళీ మళ్ళీ రెట్టించి అడిగాడు . చివరికి వాడికి ఒప్పుకోక తప్పలేదు: 'తను చాలా సంతోషించాడు' అని ఒప్పేసుకున్నాడు.

'బ్రతుకు జీవుడా' అని బయట పడ్డ రామయ్య, అందరికీ నమస్కారాలు పెట్టుకొని, చటుక్కున ఓడ ఎక్కి తన స్వస్థలానికి బయలుదేరి పోయాడు.

అతను ఇక జన్మలో మళ్ళీ తూర్పు దేశం మాట ఎత్తితే ఒట్టు.

నవ్వెయ్యండి!

దోమలకి క్రీం!

చిట్టి: దోమలు కుట్టకుండా ఉండేందుకు ఏదో దోమల క్రీం ఉంటుందట కదమ్మా?!

అమ్మ: అవును చిట్టీ! ఓడోమాస్ అని..

చిట్టి: మరి ఆ క్రీం రాసేందుకు ఒక్కొక్క దోమనూ ఎట్లా పట్టుకుంటారమ్మా?!

చిన్ని చిన్ని ఆశ!

సూరజ్: అమ్మా, మనం కూడా వినీష్ వాళ్ల లాగా ఓ టివి కొనుక్కుందామమ్మా!

అమ్మ: వాళ్ల నాన్న పెద్ద ఉద్యోగి. వాళ్లకయితే ఇంట్లోనే డబ్బులు కాస్తాయి, మనకు కాయవు కదా, నాయనా?

సూరజ్: ఏమీ పర్లేదమ్మా, వాళ్ల చెట్టుకు అంటు కట్టుకుందాంలే, మనమున్నూ!

దూరం!

టీచర్: పేదవాళ్ల గురించి నీకేం తెలుసో చెప్పు, రతన్?

రతన్: పేదవాళ్ళు చాలా పేదగా ఉంటారు. వాళ్ల బంగళాలు చిన్నగా ఉంటాయి. వాళ్ల కార్లు సరిగా నడవ్వు. వాళ్ల ఫ్రిజ్జులు త్వరగా పాడవుతుంటాయి. వాళ్ల పనివాళ్ళు సరిగా పని చెయ్యరు...



వజ్రపుటుంగరం

రచన: శ్రీమతి జి. లలిత, తెలుగు4 కిడ్స్ డాట్ కాం.

రామనాథం, బంగారయ్య పట్నం వెళ్ళే దారిలో కలిసారు. ఒకరినొకరు పలకరించుకొని, కబుర్లు చెప్పుకుంటూ నడక సాగించారు. ఇంకొంత దూరం పోయాక, వాళ్ళకు ఇంకొక వ్యక్తి కలిశాడు. తన పేరు 'లింగడు' అని చెప్పి, తనను తాను పరిచయం చేసుకున్నాడతను. అతను కూడా పట్నానికే వెళ్తున్నాడట. అలా ముగ్గురూ కలిసి ముందుకు సాగి, చీకటి పడుతుండగా పట్నం పొలిమేరలకు చేరుకున్నారు. రాత్రి పూట పట్నంలో పని ఎలాగూ జరగదు; అందుకని ఆ రాత్రికి వాళ్ళు ముగ్గురూ అక్కడే ఒక సత్రంలో ఆగారు. భోజనాలయ్యాక, ముగ్గురికీ ఒకే గదిలో పడకలు ఏర్పాటు చేశాడు సత్రం యజమాని. 'పనులయ్యాక మళ్ళీ ఇక్కడే కలుద్దాం' అని చెప్పుకొని ముగ్గురూ పడుకున్నారు.

మర్నాడు ప్రొద్దున లింగడు నిద్ర లేచే సరికి కొంచెం ఆలస్యం అయింది. రామనాథం, బంగారయ్య అప్పటికే పట్నంలోకి వెళ్ళిపోయారు.



లింగడు పక్క బట్టలు సర్దుతుంటే తళుక్కున ఏదో మెరుస్తూ కనిపించింది. 'ఏమిటా' అని చూస్తే అది ఒక హారం! 'ముందురోజున తనకు కలిసిన మిత్రులు రామనాథం, బంగారయ్యలలో ఎవరో ఒకరిది అయి ఉంటుంది' అనుకున్న లింగడు దానిని భద్రంగా తన జేబులో దాచుకున్నాడు.

అతను కాలకృత్యాలు ముగించుకుని పట్నంలోకి వెళ్ళేసరికి 'రాణీ గారి వజ్రాల హారం కనబడటం లేదు- దాన్ని తెచ్చి ఇచ్చిన వాళ్ళకి తగిన బహుమానం ఇస్తారు' అని పట్నమంతటా ప్రకటనలు వినబడుతున్నాయి. గత రాత్రి దర్శనం కోసం పట్నం పొలిమేరల్లో ఉన్న దుర్గ గుడికి వచ్చారట, రాణీ గారు. ఆవిడ తిరిగి వెళ్ళేటప్పుడు చూసుకుంటే ఏముంది, వజ్రాల హారం కనిపించలేదు.

లింగడు ఒక సారి తన జేబును తడిమి చూసుకున్నాడు. హారం భద్రంగా ఉంది. పక్కకి వెళ్ళి జేబులోంచి బయటికి తీసి చూశాడు. సూర్యకాంతిలో హారం ధగ ధగా మెరుస్తున్నది. అది నిజంగా వజ్రాల హారమే అనిపించిందిప్పుడు. 'రాణీ గారు పోగొట్టుకున్న హారం ఇదే అయి ఉండవచ్చు. దాన్ని అధికారులకు అప్పగించితే విలువైన బహుమతి పొందవచ్చు!' ఆ ఉత్సాహంలో అతనికి ఏ అనుమానమూ రాలేదు: సత్రంలోకి- అందునా తాము వాడిన పక్క బట్టలలోకి - అది ఎలా వచ్చి చేరింది, మరి?

ఆశకొద్దీ అతను వడి వడిగా కొత్వాలు కార్యాలయానికి దారి తీశాడు. అతను ఇంకా అక్కడికి చేరకనే రామనాథం, బంగారయ్య తారసపడ్డారు అతనికి.



విషయం తెలియగానే తాము కూడా కొత్వాలును కలిసేందుకు వస్తామన్నారు వాళ్ళు- ఆ వచ్చే బహుమతిలో తమకూ కాస్త వాటా దొరకవచ్చుననే ఆశ పుట్టింది వాళ్లకు. తీరా లోపలికి వెళ్ళి నగను కొత్వాలుకి చూపించగానే కొత్వాలు వాళ్ళ ముగ్గురినీ గదిలో కూర్చొ బెట్టి తలుపుకు గడియ వేసి ప్రశ్నించడం మొదలు పెట్టాడు: 'అంత విలువైన హారం మీకు ఎట్లా దొరికింది, దానితో పాటు పోయిన మిగతా నగలన్నీ ఏమయ్యాయి?' అని ఆయన అడిగేసరికి, మిత్రులు ముగ్గురూ ఖంగు తిన్నారు.

వెంటనే రంగనాథం, బంగారయ్య ఇద్దరూ ప్లేటు ఫిరాయించారు. లింగడి వైపు అనుమానంగా చూస్తూ, "బాబ్బాబు! మమ్మల్ని వదిలెయ్యండి. ఇతనెవరో నిజానికి మాకు ఏమీ తెలీదు. నిన్న దారిలో కలిసాడు అంతే. హారం కూడా మాకు దొరికింది కాదు. మమ్మల్ని పోనీండి బాబూ" అని కొత్వాలును ప్రాధేయపడ్డారు. కొత్వాలు నవ్వి, వాళ్ళిద్దరినీ ఇంకో గదిలోకి పంపి, "విషయం తేలే వరకూ మీరు ఎక్కడికీ వెళ్ళడానికి వీలు లేదు" అని ఆంక్షపెట్టి గదికి కాపలా పెట్టాడు.

"నాకు కనబడింది ఆ ఒక్క నగే నయ్యా. సత్రంలో పక్కబట్టలు తీస్తుంటే కనపడిందది. మిగిలిన నగలేమిటో, వాటి కథేమిటో నాకు అస్సలు తెలీదు" చెప్పాడు లింగడు, కొంచెం స్థిమిత పడ్డాక. "సరేలే, మరి ఆ సంగతి తేలేవరకూ నువ్వూ ఎక్కడికీ పోవద్దు" అని,

కొత్వాలు తన మనిషిని ఒకడిని అక్కడ కాపలా ఉంచి తను సత్రం యజమానిని కలవడానికి వెళ్ళాడు. "నాకేమీ తెలియదయ్యా, ఆ బాటసారులు ముగ్గురూ రాత్రి సత్రంలో దిగారు. సరిగ్గా అదే సమయానికి ఉతికిన బట్టలు తెచ్చి ఇచ్చాడు, మా చాకలి-సూరయ్య. వాళ్లకి ఆ పక్కబట్టలే ఇచ్చాను నేను" అన్నాడు సత్రం యజమాని, తనను కలిసిన కొత్వాలుతో.

కొత్వాలు వెళ్ళి చాకలి సూరయ్యను ప్రశ్నించాడు- "అయ్యో, నగలాయ్యా? నాకెట్లా తెలుస్తుందయ్యా? నాకేం తెలీదయ్యా! బట్టలు మడతేసేది నా భార్యేనండయ్యా! అది మడత బెట్టి పక్కన పెడితే, ఆ బట్టల మూటను తీసుకువెళ్ళి సత్రంలో ఇచ్చి వస్తానంతేనండయ్యా" చెప్పాడు సూరయ్య.

సూరయ్య భార్య మటుకు ఏడుస్తూ కొత్వాలు కాళ్ళమీద పడింది- "అయ్యా, నాకు తెలుసయ్యా, ఇది ఇట్లా అవుతుందని. కంసాలి వీరయ్య ఇంటినుండి వచ్చినై గద-మాసిన బట్టలు- వాటిని ఉతికేందుకు విడదీస్తాఉంటే చీరకు అంటుకొని ఉందయ్యా, ఓ గొప్ప నగ! అంతలోనే ఎవరో తలుపు కొట్టారయ్యా, నేనేమో పోతూ పోతూ దాన్ని ఆ పక్కనే ఉన్న బట్టల మూటలో పెట్టి వెళ్ళానయ్యా. వెనక్కి తిరిగి వచ్చేసరికి ఆ మూట అక్కడ లేదయ్యా- మా సూరయ్య దాన్ని పట్టుకుని వెళ్ళి పోనాడయ్యా, నిజమయ్యా, కాపాడయ్యా!" అంటూ.

"మరి నువ్వు ఆ హారం వెనక పడి పోలేదా?" అడిగాడు కొత్వాలు.

"అయ్యా, పేద వాళ్ళం, పని చేసుకొని బ్రతుకుతాం. అంత పెద్ద నగ నీకెట్లా వచ్చిందని ఎవరైనా అడిగితే ఏం చెప్తాం? అందుకని ఆ సంగతి మా సూరయ్యకు కూడా చెప్పలేదయ్యా, నాలో నేనే వణికిపోతా ఉన్నా, నిన్నటినుండీ" అన్నది సూరయ్య భార్య.

కొత్వాలు కొంచెం ఆలోచించి, హారాన్ని పట్టుకొని కంసాలి వీరయ్య ఇంటికి వెళ్ళాడు. ఆ సమయానికి వీరయ్య ఇంట్లో లేడు.

"ఈ నగ నీదేనా?" అని అడిగాడు కొత్వాలు,

హారాన్ని వీరయ్య భార్యకు చూపిస్తూ.



"అవునండీ, నాదే. నిన్న ఉదయం మా ఆయన దగ్గర చూసి నచ్చిందని తీసుకున్నాను. 'ఇది బంగారంది కాదు; గిల్టునగ' అన్నాడండీ, మా ఆయన. అయినా బాగుంది కదా, అని దాన్ని పెట్టుకొని పేరంటానికి కూడా వెళ్ళానండీ. వెనక్కి వచ్చి బట్టలు మార్చుకున్నాక చూస్తే అది కనిపించలేదు. 'పోనీలే, గిల్టుదేగా?' అని ఊరుకున్నానండి. అయినా ఈ రోజు ఉదయం మా ఆయన దాన్ని గురించి అడిగాడండీ- నేనేమో అది పోయిందని చెప్పాను- అంతెత్తున ఎగిరాడండి. చాలా కోప్పడ్డాడు. గిల్టునగకోసం అంత కోప్పడేదేముందండి- అరిచీ అరిచీ నోరు నొప్పి పుట్టాక, కొన్ని నగలు మూట కట్టుకొని ఎటో వెళ్ళాడండి. ఇప్పుడు ఆ గిల్టునగ కూడా దొరికింది చూడండి. అందుకే నేననేది- ఊరికే కోపం తెచ్చుకొని అరవకూడదండి" అన్నదామె.

కొత్వాలు నవ్వి, హారాన్ని ఆమెకే ఇచ్చేసి, వీరయ్య వచ్చేవరకూ ఆగకుండా తన కార్యాలయానికి తిరిగి వెళ్ళిపోయాడు. వెంటనే హడావిడిగా తన మనిషిని ఒకడిని పిలిచి, ఏవో సూచనలు ఇచ్చి, జాగ్రత్తలు చెప్పి పంపించాడు.

ఆ తర్వాత రామనాథాన్నీ, బంగారయ్యనీ, లింగడినీ వదిలి పెట్టించి, పదిమంది ఎదుటా లింగడిని మెచ్చుకొని "నీ మూలంగానే దొంగ దొరికాడు, నీవల్లనే రాణిగారి నగలన్నీ దొరికాయి. త్వరలో నిన్ను రాజుగారే స్వయంగా సన్మానిస్తారు" అంటూ తనవంతుగా ఓ చిన్న బహుమతి ఇచ్చి

పంపాడు. ముగ్గురూ సంతోషంగా వాళ్ళ వాళ్ళ ఊర్లకు వెళ్ళిపోయారు.



రెండు రోజుల తర్వాత కొత్వాలు మనుషులు వెళ్ళి కంసాలి వీరయ్యను బంధించి పట్టుకు వచ్చారు . తర్వాత అతని ఇంట్లో సోదా చేసి వజ్రాల హారంతో పాటు పోయిన నగలన్నీ కూడా బయటికి తీశారు. ఆలోగా కొత్వాలు మనుషులను పంపి 'బండడు' అనే వాడినికూడా బంధించాడు. ఇద్దరినీ నగలతో సహా రాజుగారి ముందు హాజరు పరిచాడు కొత్వాలు.

అటుపైన కొత్వాలు జరిగిన విషయం రాజు గారికి ఇలా వివరించాడు:

"మహారాజా, బండడు అనే ఈ మనిషి అసలు దొంగ. తను దొంగిలించిన నగలను ఇతను అలవాటుగా కంసాలి వీరయ్యకు అమ్ముతుంటాడు. కంసాలి వీరయ్యకు దొంగ సొమ్ము తినే అలవాటు ఉంది. 'దొంగసొమ్ము' అనే పేరుతో నగలను తక్కువ ఖరీదుకి కొంటుంటాడు కూడాను. ఆనక వాటిని కరిగించి ఎక్కువ ధరకు అమ్ముకుంటాడు.

ఈ సారి మహారాణి గారి నగల మీదే కన్ను వేశాడు బండడు. దొంగిలించాక వాటిని కూడా ఎప్పటి మాదిరి వీరయ్యకే అమ్మాడు. వీరయ్య కూడా చాలా తక్కువ ధర చెల్లించి వాటిని సొంతం చేసుకున్నాడు. ఆపైన అతను ఆ నగలను చూసి మురిసిపోతుండగా అతని భార్య చూసింది. ఆమె అడిగే సరికి 'అవి గిల్టువి' అని అబద్ధం చెప్పేశాడు వీరయ్య. అయితే మర్నాడు తెల్సింది అతనికి- వజ్రాల హారాన్ని భార్య పోగొట్టిందని! ఇప్పుడు ఇంక ఆ సొమ్మును ఇంట్లో ఉంచటం భద్రం కాదు- ఎవరైనా అనుమానించచ్చు! అందుకని ఆ నగల్ని తీసుకెళ్ళి వేరే చోట ఎక్కడో రహస్యంగా

దాచి వచ్చాడు. అందుకనే, వీరయ్య సంగతి నాకు తెలిసే సరికి నగలు అతని వద్ద లేవు. ఆ సమయంలో నేను అతన్ని నిలదీసినా, అతను తనకేం తెలీదని బుకాయించి ఉండేవాడు. అందుకని నేను తెలివిగా హారాన్ని అతని భార్యకు ఇచ్చేసి వెనక్కి వచ్చాను. దాంతో నేను కూడా అతన్ని నమ్మాననుకున్నాడు. అయితే వీరయ్య ప్రతి చర్యనూ రహస్యంగా గమనించమని నేను నా మనుషులను నియోగించి ఉన్నాను. రెండు రోజుల్లో అతను ఆ నగలకోసం వెళ్ళటం, నేను అతన్ని బంధించటం జరిగిపోయాయి".

రాజుగారు కొత్వాలును మెచ్చుకున్నారు. "మరి బండడు ఎట్లా దొరికాడు?" అని అడిగారు.

"వీరయ్య ద్వారా బండడు ఎలాగూ దొరికేవాడు. అయితే, రాణిగారి నగల్ని తననుండి అంత తక్కువ ధరకి కొనుగోలు చేశాడని వీరయ్య మీద అలిగాడు బండడు. అతనితో పోట్లాడేందుకు వచ్చి, నేరుగా మా చేతికి చిక్కాడు- అట్లా మా పనిని సులభం చేశాడు" నవ్వాడు కొత్వాలు.




"మరి దొంగను పట్టిచ్చినందుకు బహుమానం లింగడికి ఒక్కడికే ఎందుకిచ్చావు? రంగనాథం-బంగారయ్యలకి పంచలేదేమి?" అడిగారు రాజుగారు.


"నిజానికి రామనాథం-బంగారయ్యలకు దొంగను పట్టి ఇవ్వడంలో ఎటువంటి పాత్రా లేదు ప్రభూ. 'లింగడికి బహుమానం దొరికితే తమకు కూడా ఎంతో కొంత రాకపోదు' అని వాళ్ళు ఆశ పడ్డారు అంతే. తీరా అది దొంగ సొమ్మని తెలిసేసరికి, తప్పును లింగడి మీదికి తోసి తప్పించుకోజూసారు. లింగడిది

మెరుగైన వ్యక్తిత్వం. తనది కాని హారాన్ని ఆశించక, దాని సొంతదారులకు దాన్ని తిరిగి ఇచ్చేసేందుకు ముందుకొచ్చాడు అతను; పరోక్షంగా మనకు దొంగ దొరకడానికి సాయం చేశాడు. అందువల్ల అతనే బహుమతికి యోగ్యుడు"

రాజు గారు కొత్వాలుని అభినందించి, దోషులను తగిన విధంగా శిక్షించారు. ఆనక ఆయన చేతులమీదుగా లింగడికి పెద్ద బహుమానం లభించింది.



బొమ్మల్ని ఇప్పుడు చూసి వేస్తే, రేపు చూడకుండా వేయచ్చు!



జెన్ సన్యాసి-పులి

అంతకు ముందున్న పులే ఇప్పుడూ ఉంది; అంతకు ముందు ఏమీ చేయనట్లుగానే ఇప్పుడూ అది ఏమీ చేయలేదు. మరి మధ్యలో మారింది ఏమిటి అసలు?!..ఆలోచించండి!

మూలం: Buddhist tales *స్వేచ్ఛానువాదం: నారాయణ* *చిత్రాలు: విద్యార్థి బి. భరత్ రాజ్*


బౌద్ధ సన్యాసి ఒకతనికి పూర్తి ఏకాంతంలో ధ్యానం చేయాలని కోరిక కలిగింది ఒకసారి. 'నరపురుగంటూ ఉండని స్థలం ఏదా' అని ఆలోచించి, దట్టమైన ఓ అడవి లోతుల్లోకి చేరుకొని, అక్కడ ధ్యానానికి కూర్చున్నాడతను.

అక్కడ వాతావరణం చాలా కఠినంగా ఉంది; అంతేగాక అక్కడ తినేందుకు, ఉండేందుకు

కూడా పెద్ద వసతిగా లేదు. దాంతో అతనికి ధ్యానంలో ఏకాగ్రత కుదరలేదు. అతని మనసు నిరంతరంగా గ్రామజీవితం వైపుకు, అక్కడి సౌకర్యాలవైపుకు పారిపోవటం మొదలుపెట్టింది.

అతను ఆ మనసుతో తంటాలు పడుతుండగానే సాయంత్రం అయ్యింది. ఆ సమయంలో అతనికి 'ఎవరో తనను గమనిస్తున్నారు' అనే భావన కలిగి, రాను రాను బలపడుతూ వచ్చింది. చివరికి అతను ఇక కళ్ళు తెరిచి చూడవలసిందే అనుకొని, మెల్లగా కళ్ళు తెరచి, తల ప్రక్కకు తిప్పి, చూశాడు- ఏముంది, నిజంగానే అక్కడ ఒక పులి, తన ప్రక్కన ఉన్న ముళ్ళ పొదలో కూర్చొని ఉంది!

అతని గుండె ఉద్వేగంతో ఊగిసలాడిపోయింది. తను ఏమాత్రం కదిలినా, పులి ధ్యాస చెదిరిపోతుంది. అది ఇక తన మీదికి దూకుతుంది- ఖచ్చితంగా! ఇప్పుడిక తను చేయగలిగిందంటూ ఏమీ లేదు- తన శరీరాన్ని ఇనుపకడ్డీ మాదిరి గట్టి చేసుకొని, స్థిర చిత్తంతో- ఏమాత్రం కదలకుండా కూర్చున్నాడు. ఇక ఇప్పుడు అతని మనసు తొణకటం లేదు. మెల్లగా ధ్యానం కుదిరింది.



సూర్యుడి తొలి కిరణాలు పడేసరికి, పులి లేచి నిలబడి, ఓ సారి గట్టిగా ఆవలించి, వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. ఆ తర్వాత కొంత సేపటికి కళ్ళు తెరిచిన బౌద్ధ సన్యాసి, ఆనాటి తన అనుభవాన్ని గుర్తుకు తెచ్చుకొని, ఆ స్థలాన్ని వదిలి పోకూడదని నిశ్చయించుకున్నాడు. ఆనాటి రాత్రే కాదు; ఆ తరువాతి రోజు రాత్రి కూడా పులి వచ్చి అతని ప్రక్కనే పొదలో కూర్చున్నది. అయితే

ఇప్పుడు సన్యాసి మనసు అచంచలమై, ఏకాగ్రమై, ధ్యానంలో కుదురుకొని ఉన్నది. అతని శరీరం నిశ్చేష్టం అయిపోయింది. అందులో ఇప్పుడు ఇంక ఏలాంటి కదలికలూ లేవు.

ఆ మూడవనాటి రాత్రి సన్యాసి తపం ఫలించింది. ఏకాగ్రం అయి నిరంతరంగా మూడు రోజులు గడిపిన ఆ మనసు, తనలోని మాలిన్యాలనన్నిటినీ విడచి పెట్టి పరిశుద్ధమైంది. సన్యాసికి ఇక భయం అంటూ లేకుండా పోయింది.

మరునాడు ఉదయం ఇంకా పులి అక్కడే ఉంది; కానీ సన్యాసి ప్రశాంతంగా లేచి నిలబడి నడవసాగాడు. పులికూడా పిల్లిలాగా అతని వెంట నడిచింది: భయాన్ని గెలిచిన ఆ సన్యాసిని అడవి చివరివరకూ సాగనంపి తన దారిన తను పోయిందది!

బాబోయ్! ఆరోగ్యం!

నిద్ర-నడక!

డాక్టర్: అరోగ్యం కోసం రోజూ నడక అలవాటు చేసుకో

రోగి: నాకు నిద్రలో నడిచే అలవాటుంది. అది సరిపోతుందా డాక్టర్?

పిచ్చి ముదిరింది!

రాము: రోగం నయం అయ్యిందా? ఆస్పత్రినుండి ఎప్పుడొచ్చావ్?

సోము: రేపువచ్చా.., నిన్న మళ్ళీ వెళ్తా!

చవకవుతున్నాయి!

రోగి: ఎంత ప్రయత్నించినా పొగ త్రాగటం మటుకు మానలేకపోతున్నాను డాక్టర్!

డాక్టర్: పర్లేదులెండి! త్వరలో క్యాన్సర్ మందుల ధరలు తగ్గబోతున్నాయట...!



తెలివైన ముసలమ్మ

అపాయాలు ఎదురైనప్పుడు తెలివిగా తప్పించుకోవాలి- ఇదిగో, ఈ ముసలమ్మలాగా! ఈ కథ మీకు తెలుసేమో, అయినా మళ్ళీ ఓసారి చదివి నవ్వుకోండి..

అనుసృజన: నారాయణ, కొత్తపల్లి బృందం.

గీతమ్మ పెద్దదైంది. కొడుకులు కోడళ్ళు అందరూ ఎక్కడో దూరంగా ఉంటారు. తను మాత్రం పల్లెలోనే, ఒంటరిగా ఉంటోంది. ఆమెది స్వతంత్ర చిత్తం- అన్ని పనులూ సొంతగా చేసుకొని, అట్లాగే అలవాటైంది- వేరేగా పనివాళ్ళనిగానీ, కనీసం తోడుగాగానీ ఎవ్వరినీపెట్టుకోలేదు. ఊళ్ళోవాళ్ళు చాలామంది ఆమెని 'పిసినారి గీతమ్మ' అంటారు. 'పనికి కూలోళ్ళని కూడా పెట్టుకోదు- ఒట్టి పిసినిగొట్టు' అనుకుంటారు. కానీ అసలు సంగతి ఏంటంటే, గీతమ్మకు తన పనులు తను చేసుకోవటం ఇష్టం; ఒంటరిగా ఉండటమూ ఇష్టం. ఆమె ఉండే ఇల్లు ఊళ్ళో ఇళ్ళన్నిటికీ దూరంగా, విసిరేసినట్లు

ఉంటుంది. తన ఆ ఇల్లంటే గీతమ్మకు చాలా చాలా ఇష్టం. పట్నపు ఇళ్ళలోని రొద ఆ ఇంట్లో ఉండదు- ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉంటుంది.



ఒక రోజు రాత్రి పరిస్థితి మారింది. ఇంకా తెల్లవారకనే గీతమ్మకు మెలకువ వచ్చింది: ఇంటి ముందు నిలబడి ఎవరో మనుషులు మాట్లాడుతున్నారు. "ఎవరో ఊళ్ళోవాళ్ళే అయిఉంటారు- ఏ కోడో, ఆవుదూడో తప్పించుకొని వచ్చి ఉంటుంది; ఇప్పుడు ఆ వంకన నన్ను తిడతారు" అనుకొని మెల్లగా కిటికీలోంచి తొంగి చూసిందామె.

ఇంటి బయట పెరట్లో నిలబడి మాట్లాడుకుంటున్నారు, ఓ ఐదారుగురు మనుషులు. చీకట్లో వాళ్ళ నీడలు పొడుగ్గా, భయం గొల్పుతూ ఉన్నాయి. ఎవరో ఈ ప్రాంతం వాళ్ళులాగానైతే లేరు- గొంతులు తగ్గించి మెల్లగా మాట్లాడుకుంటున్నారు. గీతమ్మ కొంచెం సేపు చెవులు రిక్కించి వాళ్ళేం అనుకుంటున్నదీ విన్నది- అప్పుడర్థం అయ్యిందామెకు- "తన ఇంటి ముందున్నది ఓ బందిపోటు దొంగల గుంపు! 'ఈ ఇంట్లో ఎవరూ లేరు'అనే సంగతి వాళ్లకు చాలా నచ్చింది! ఇప్పుడు ఇంట్లోకి జొరబడి, ఏది కనిపిస్తే దాన్ని ఎత్తుకు పోదామను-కుంటున్నారు! వాళ్ళ మొరటు బలం ముందు తను ఏపాటి?! తన నగలూ, వస్తువులూ అన్నీ ఇక వాళ్ల పరం కానున్నాయి- తను రేపు పొద్దుటివరకూ ప్రాణాలతో మిగిలితే అదే పదివేలు!"

"చూశారుగా, ఇంట్లో సద్దన్నదే లేదు- ఒక్క నరమానవుడు కూడా లేదు ఇంట్లో- పదండి- ఇంటి తలుపులు పగలగొట్టండి- అంతా మనదే!" అంటున్నాడొక దొంగ ఉత్సాహంగా.

మిగిలిన దొంగలంతా అతనితోటి ఏకీభవించారు. "అవునవును. ఇళ్ళు మరీ ఇంత సులభంగా దొరికితే బాగుండవు- అస్సలు మజా రాదు- ఈ ఇల్లు ఊరికి ఎంత దూరంగా ఉందో చూడండి- మనం దీన్ని దోచేసిన సంగతి కూడా ఎవ్వరికీ తెలీకపోవచ్చు, ఓ వారం-పది రోజులు!" అన్నాడింకొకడు.

వాళ్ల మాటలు వింటున్న గీతమ్మకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. భయంతో ఆమె గుండె జారిపోయింది. శరీరం వణికింది. "వీళ్ళు ఏ క్షణంలోనైనా ఇంట్లోకి వచ్చేస్తారు- ఇంట్లో తను ఎదురైందంటే అప్పటికప్పుడు చంపేస్తారు-ఖాయం" అనిపించి ఏడుపొచ్చింది. ఒక్క క్షణంపాటు 'ఇంటిని ఇట్లా మరీ ఒంటరిగా కట్టుకొని తను పెద్ద తప్పే చేసిందేమో' అనుకున్నది. 'తనకే ఓ పెద్ద కుటుంబం ఉంటే ఎంత బాగుండేది, ఇల్లంతా సందడిగా, గొడవ గొడవగా?! దొంగలూ-గింగలూ ఈ ఇంటి దాపుల్లోకి కూడా వచ్చేందుకు భయపడేవాళ్ళు!'

అకస్మాత్తుగా ఆమెకో ఉపాయం తట్టింది. తనకు 'కుటుంబం' అంటూ ఏదీ లేదు కానీ, నిజానికి తను ఏమంత ఒంటరిది కూడా కాదు! ఆమె వంటింట్లోకి పరుగెత్తి, చేతికందిన గిన్నెలు, తప్పాలలు, తట్టలు - అన్నీ ముందు గదిలోకి తెచ్చి పెట్టుకున్నది. వెంటనే పెద్ద గొంతుతో ఆ పాత్రలనే అరవటం మొదలుపెట్టింది-మనుషులను అరిచినట్లు:



"ఒరే, లోటే! ఎన్నిసార్లు చెప్పాలిరా? లే! లేచి చదువుకో!!

ఏయ్- తట్టేయ్! ఏంటిరా, నీ మొద్దు నిద్ర?! పరీక్షల సమయంలో ఇట్లానట్రా, చదివేది?!లే!

అబ్బ! ఈ తప్పేలగాడికి ఒళ్ళు పెరిగింది గానీ, మెదడు ఏమాత్రం పెరగలేదు! లేరా! లేచి చదువు! లేండి!"

అయ్యయ్యో! వీళ్ళు పదిమందీ నా ప్రాణానికి ఇట్లా చుట్టుకున్నారే! ఒక్కడూ సరిగ్గా చదివి చావడు! లేవండి లేవండి! మిమ్మల్ని నిద్ర లేపే సరికే నా తల ప్రాణం తోకకొస్తోంది- లేవండిరా! లేవమంటుంటే-!" అంటూ ఆమె చేతికందిన కట్టెతో లోటాలను, తప్పేలలను, తట్టలను ధనధనలాడించటం మొదలు పెట్టింది.

"లేవండి! లేవండి! చూసిన వాళ్ళు ఏమనుకుంటారు?! ఇది ఇల్లా, స్మశానమా? చప్పుళ్ళే లేకుండా- లేచి గట్టిగా చదవాలి! చదవండి!" అంటూ ఆమె పాత్రల్ని గడగడలాడిస్తుంటే, బయట దొంగలందరూ ఒక్కసారిగా దడదడలాడిపోయారు:

"మన లెక్క ఎక్కడో తప్పినట్లుందిరా!" అన్నాడొక దొంగ.

"ఎవ్వరూ లేరనుకున్నాం! ఇంటినిండా మనుషులేరా!" అన్నాడింకొకడు.

"పదండి! పరుగు పెట్టండి! వాళ్ళు బయటికి వచ్చారంటే చచ్చామే!" అరిచాడింకోడు.

దొంగలంతా ఒక్క సారిగా కాళ్లకు బుద్ధి చెప్పారు. వాళ్ల కంగారులో వాళ్ళు తమ వెంట తీసుకొచ్చిన నగల మూటను కూడా మరచిపోయారు!

మరునాడు గీతమ్మ తలుపు తెరిచి చూసేసరికి, ఇంటి వాకిలికి ఎదురుగా ఓ పెద్ద గోతం సంచీ నిండుగా నగలు, బంగారం, డబ్బు! ఆమె తన కళ్లను తాను నమ్మలేకపోయింది.

గోతం సంచీని ఇంట్లోకి లాక్కెళ్తూ "ఓయ్! తట్టోయ్! లోటోయ్! తప్పేలోయ్! రండి! చూడండి, మనకోసం దొంగలు ఏం వదిలి వెళ్ళారో!" అని అరిచింది సంతోషంగా.

ఆరోజు నుండీ ఆమె ఊళ్ళో మనుషుల్ని ఇద్దరిని పనికి, తోడుకు పెట్టుకున్నదని వేరే చెప్పక్కర్లేదుగా?!

కొత్తపల్లిలోని పాటల్ని ఇంటర్నెట్లో వినచ్చు!.సందర్శించండి: http://kottapalli.in

చిట్టి పాట!

గానం: చి. నిరుతి, శ్రీ బి.చక్రి



కాకీ కాకి!

కాకి కాకి

కడవల కాకి

కాకి నోట్లో

కర్ర ఉంది

కర్ర తెచ్చి

అమ్మకిస్తే

అమ్మ నాకు

అట్టు ఇస్తే

అట్టు నేను

ఆవు కిస్తే

ఆవు నాకు

పాలు ఇస్తే

పాలు నేను

అవ్వకిస్తే

అవ్వనాకు

జున్ను ఇస్తే

జున్ను నేను

మామకిస్తే

మామ నాకు -పిల్లనిస్తే

పిల్ల పేరు -మల్లెమొగ్గ

నాపేరు - జమీందార్!!

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

నిర్వహణ: శ్రీ వి.వి.యస్. మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమగోదావరి జిల్లా.

1. కొత్తతరం పూజారి ఏమని అడ్వర్టయిజుమెంటు ఇచ్చాడు?

"ఈ గుడిలో పూజ చేయండి- ఉచిత డోర్ డెలివరీ కలదు" అని.

2. లెక్కల మేస్టారు ఇష్టంగా ఎంచుకున్న ఇంటి నెంబరు ఏది?

1/2 -3/4 +5/6 x 7/8 % 9

3. ఎవరి చెంపమీద వాళ్ళు కొట్టుకునేది ఎప్పుడు?

చెంపను దోమ కుడుతున్నప్పుడు!

4. తాత ముత్తాతలు సంపాదించకుండానే మనకు అందేది ఏది?

కాలం!

5. మాటల మూటలు మోసేదెవరు?

ఫోను!

6. ఏ దేవుడికీ చెందని దీక్ష ఏది?

నిరాహార దీక్ష!

7. ప్రాణంలేకపోయినా కరిచేది ఎవరు?

చెప్పు!

సమీక్ష

కొత్తపల్లి-62 పై ఒక సమీక్ష.. *సమీక్షకులు: శ్రీరాజా పిడూరి*



చల్లటి గాలులు, చిటపట చినుకులు, తొలకరివాన వాసనలు- వీటన్నింటినీ గుర్తుకు తెచ్చాయి, ఈ నెల ముఖచిత్రం, సంపాదకీయం - రెండూ!

ఈసారి కొత్తపల్లిలో చదవగానే "అహ! " అనిపించిన కథ మూర్తి గారి "మంచి దొంగ". జీవితంలో చాలా సందర్భాలలో అసలు 'వస్తువుని వాడటం' కన్నా, 'ఆ వస్తువు నా దగ్గరే ఉంది' అన్న భావమే మనకి సౌఖ్యాన్ని ఇస్తుంది. - ముఖ్యంగా ఇది డబ్బుల విషయంలో పెద్దవాళ్ళకి, ఆడుకొనే వస్తువుల విషయం లో చిన్న పిల్లలకి- చాలా సత్యం. ఈ నిజాన్ని ఎంతో చక్కగా చూపించిందీ కథ. అందరికీ తెలిసిన ఒక పాత కథని ఇంత అందంగా మలచడం ప్రశంసనీయం. ఈ నెల చిలిపి ప్రశ్నలూ, ఎన్నో జోక్స్ తో నవ్వించడమే కాకుండా మంచి కథ వ్రాసారు మూర్తి గారు.

ఇలాంటి సత్యాల్ని చెప్పిన కథలు ఈ సంచికలో చాలానే ఉన్నాయి. రూమీ కథ (పిట్ట చూపు), బౌద్ధకథ (నిధి-కుక్క), రాధ కథ (సహాయం), అఖిల్ కథ (అసలైన సంపద) లు సూటిగా సత్యాల్ని తెలియజేసాయి. రూమీ కథ లో పిట్ట చివరి సలహా చెప్పకుండా ఎగిరి పోతూ అన్నట్లున్న మాటలు కూడా విలువైన సలహా లాగే ఉండటం చాలా బాగుంది ! 'సంతోషం' కథ చివర లో చెప్పిన విలువైన సత్యాన్నిఅర్థం చేసుకోవడానికీ, దానిని కథ లోని సంఘటనలలో చూడడానికీ కొంచెం జాగ్రత్తగా ఆలోచించాల్సిందే. 'సౌకర్యాలూ, సుఖాలూ బయటినించి ఎన్ని వచ్చినా, సంతోషం మాత్రం లోపల్నించి రావల్సిందే' అన్న సత్యాన్ని కథలోని సంఘటనలు అస్పష్టంగా చిత్రించాయనిపించింది.

'మన పని మనం చేసుకోవటమే మంచిది' అన్ననీతిని చెప్పాయి స్వర్ణలత వ్రాసిన 'ముసలాయన-ఆవు', మల్లేష్ వ్రాసిన 'పని ఎలా జరుగుతుంది?' కథలు.

పర్యావరణం గురించిన రెండు కథలూ (పుట్టిన రోజు బహుమతి - క్రాంతి; స్వగతం - కిరణ్) ఒకదానికొకటి పూరకంగా ఉన్నాయి. 'స్వగతం' కథలో మనుషులు చెట్లని దిష్టి బొమ్మల్లా ఎలా చూస్తున్నారో చెబితే, కూరగాయలూ పండ్ల మొక్కల్నే చాక్లెట్లు గా, బహుమతి గా ఎలా ఇవ్వవచ్చో చిత్రించింది పుట్టిన రోజు బహుమతి కథ. రోహిత్ వ్రాసిన 'స్పిరిట్' కథలో పాయింట్ చాలా బాగుంది. చివరలో భాష మరీ పెద్దవాళ్ళదయిపోయినట్లుగా ఉంది.

చివర్లో 'కల' తో ముగిసిపోయే కథ ఒక్కటైనా లేకపోతే పిల్లల పత్రికకు నిండుదనం రాదు. ఆ లోపాన్ని పూరించినట్లుగా ఉంది, దేవీ చందన వ్రాసిన 'ఊహ' కథ. ఇక మూఢ నమ్మకాల నేపథ్యం లేకుండా వ్రాసిన ఇంద్రజాలపు కథ (ముళ్ళ కంచె) చదివించింది. ఇలాంటి కథలు మరిన్ని వస్తాయని ఆశిద్దాం.

దశాని వ్రాసిన 'మారు అడక్కూడదు' కథ నవ్వించింది. ఇన్ని పేజీల కథకు వేసింది ఒక్క బొమ్మే అయినా, పాఠం చెపుతున్న టీచర్ ఊహలో వంకాయని చిత్రించడం బాగుంది. 'నీతి చంద్రిక'లో కథనం స్థాయిలో బొమ్మలు కూడా ఉంటే బాగుంటుంది అన్పిస్తుంది.

'యువ కెరటాలు'లో 'కాటో-కకాలా' కథని సౌమ్య గారు చెప్పిన విధానం చాలా బాగుంది. ఒక్క వ్యక్తి వల్ల కొన్ని దీవుల సమూహం లోని ప్రజలందరికీ లైబ్రరీ ఏర్పడటం అనేది ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉంది. 'కొద్ది మందికైనా, చాలా మందికైనా ఉపయోగపడే పనులు జరగాలంటే, అది ఎక్కడో- ఎవరో వ్యక్తి- లేదా వ్యక్తుల- స్థాయి లోనే మొదలవ్వాలి' అనే విషయాన్ని చక్కగా తెలిపింది, కాటో-కకాలా కథ. ఇక చివరి అట్ట మీద మంచి పుస్తకం శీర్షిక లో పుస్తకం గురించి వ్రాసి ఫోన్ నంబర్ ఇవ్వడం ఎంతో ఉపయోగం గా ఉంది. అభినందనలు!

ముద్రిత ప్రతుల వెల: ప్రతి ఒక్కింటికి: 25 రూ.
12 పుస్తకాలకైచందా: **రూ. 300/-**

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:

"Kottapalli Trust", A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సాంకేతికత: ఆనంద్, లక్ష్మి
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
ముఖచిత్రం : వీరాంజనేయులు
చిత్రాలు: అడవి, ప్రసాద్, చంద్రకాంత్, పూర్ణ, రామకృష్ణ, భరత్, హారతి.
పాటలు: సమాలోచన చక్రి గారు
కథలు, జోకులు: చాలామంది పిల్లలు, పెద్దలు

కృతజ్ఞతలు: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయం వారికి, మ్యాజిక్ కథల రావు గారికి, రాధా రాజశేఖర్-సోమి రెడ్డి గార్లకి, తెలుగు4కిడ్స్ లలిత గారికి, పుస్తకం డాట్ నెట్ సౌమ్య గారికి, రిషీవ్యాలీ బడి వారికి, చిలిపి ప్రశ్నలమూర్తి గారికి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి..

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మంచి పుస్తకం:

పిల్లల కథలు

-కెఆర్‌కెమోహన్

పిల్లలు ఓసారి కథలు అట్లా అట్లా చదవటం మొదలుపెట్టారనుకోండి, రుచి తెలుస్తుంది.

ఓసారి రుచి తెలిసిందనుకోండి, ఇక వాళ్ళు ఆగరు- ఇంకా ఇంకా కథలు కావాల్సిందేననిపిస్తుంది.

'అన్నన్ని కథల పుస్తకాలు ఎక్కడినుండి తెస్తాం బాబూ!' అనిపిస్తుంది తల్లిదండ్రులకు. 'అయినా ఎట్లాంటి పుస్తకాలు తేవాలి?' అని అనుమానం వస్తుంది వాళ్లకు.

ఇదిగో- ఇట్లాంటి పుస్తకాలు వెతికి తెచ్చిపెట్టాలి, అప్పుడు!

'కథలు చదువుతాం-ఇస్తే చాలు!' అనే పిల్లలకు ఇవ్వాల్సిన అగ్రశ్రేణి పుస్తకాల్లో ఒకటి, కెఆర్‌కెమోహన్ గారి 'పిల్లల కథలు'.

ఎప్పుడో 'బాల' పత్రికలో తను రాసిన మొదటి కథనుండి మొన్నమొన్న 2000 లో రాసిన కథల వరకూ- ఓ డెబ్భై ఆణిముత్యాలను ఏరి, చక్కని పెద్ద పుస్తకంగా కూర్చిపెట్టారు మోహన్‌గారు. చంద్ర గీసిన బొమ్మలు మనసుకు నచ్చుతాయి కూడా.

ఇక ఆలస్యం ఎందుకు?

వెంటనే సంపాదించండి- రాయండి, ఫోను చేయండి, లైబ్రరీల్లో వెతకండి- చదివెయ్యండి!!

పిల్లల కథలు
కెఆర్‌కెమోహన్
శ్రీముఖ పబ్లికేషన్స్,
ఫ్లాట్ నం. 101, కంచి రెసిడెన్సీ,
పి&టి కాలనీ, దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాదు- ఫోను 4065900
వెల: 100 రూ. పేజీలు: 246



నిలకడ

"మా వాడికి బొత్తిగా నిలకడ లేదండీ" చెప్పాడు సుబ్బారావు.

"అంటే ఎప్పుడూ ఎగురుతూ ఉంటాడా?" అడిగాను.

"అవునండీ, కాలు ఒక చోట నిలవదు".

"మరి నోరు?" అడిగా.

"అయ్యో! ఆ నోటి గురించి ఏం చెప్పాలి? బడ బడ వాగుతూనే ఉంటుందెప్పుడూ" అన్నాడు.

"ఓహో! మరైతే ఆకలి బాగానే ఉండి ఉంటుంది" అన్నా.

"అమ్మో! మామూలు ఆకలి కాదు. ఎప్పుడూ ఏదో ఒకటి కరకరా నముల్తూనే ఉంటాడు".

"మరి ఆటలు?"

"ఒకటే ఆడతాడు! ఒకసారి దాగుడు మూతలు, ఒకసారి గోలీలు, ఒకసారి కోతికొమ్మచ్చి, ఓసారి ఇంకేదో, ఓసారి ఇంకేదో. ఆడుతూ ఉండమంటే రోజంతా ఆడతాడు" అన్నాడు సుబ్బారావు.

"ఏమైనా వస్తువులు తయారు చేస్తాడా? రిపేర్లు వగైరాలు?"

"బాగా కనుక్కున్నారు సార్! ఎప్పుడూ ఏదో ఒకటి రిపేరు చేస్తూనే ఉంటాడు. కొత్తగా రోబాట్ బొమ్మ కొనిపెడితే రాత్రికల్లా దాన్ని విరిచి ముక్కలు చేసిపెట్టాడు- లోపల వెలిగే బల్బు ఎలా వెలుగుతుందో చూడాలట!"

"మరి మీ బండి స్పీకర్లని వదిలిపెట్టి ఉండడు!" అన్నాను నేను.

"నిజంగానే వదల్లేదు మాస్టారూ! దాన్లో ఎక్కడో ఓ మంచి అయస్కాంతం ఉంటుందట. దాన్ని ఇసకలో దొర్లిస్తే చాలా ఇనప రజను వస్తుందట. ఇనప రజనును అట్టమీద పోసి, క్రింద అయస్కాంతాన్ని కదిలిస్తే చాలట- మహాభారత యుద్ధం కళ్ళముందు కనబడుతుందట!"

"ఓహో, మీవాడికి మహాభారత యుద్ధం కూడా తెలుసా?" అడిగాను నేను ముచ్చట పడుతూ.

"అయ్యో, వాడికి ఉన్నంత కథల పిచ్చి మాకు కూడా ఉండదండీ. ఎప్పుడూ 'కథలు-కథలు' అని వేధించుకు తింటాడు. అప్పటికీ వాళ్ళ అవ్వ ఏవేవో కథలు చెబుతూనే ఉంటుంది. మీకు వాడి గురించి అన్నీ తెలిసినట్లే ఉంది- మా వాడికి కొంచెం మంచి బుద్ధులు ఎలా వస్తాయో చెప్పండి కాస్త! ఏమైనా ధ్యానం నేర్పించమంటారా?"

"వాడికేముందిగానీ, ముందు మీకో మాట చెబుతాను-" అన్నాను.

"చెప్పండి"

"ఏం లేదు, మీవాడిని గురించి చింత పడటం మానెయ్యండి. వాడు చాలా చక్కగా ఎదుగుతున్నాడు- ఇప్పుడే ఏమాత్రం నిలకడ తెప్పించకండి వాడికి. ఇంకొంతకాలం ఇట్లాగే సంతోషంగా ఉండనివ్వండి, పర్లేదు!"

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222
E-mail: team@kottapalli.in . Printed at Mudrica Offcet Printers, Vijayawada, Phone: 0866 2579129